

గంజాయిపై ఉక్కుపాదం

నియంత్రణకు బహుముఖ వ్యూహం

- సాగు, రవాణా, వినియోగంపై మరింత నిఘా
- ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం
- కాఫీ, సిల్వర్ ఓక్, అవకాడో, డ్రాగన్, మామిడి, సీతాఫలం మొక్కలు పంపిణీ
- ఈ ఏడాది 45 ఎకరాల్లో గంజాయి సాగు చేస్తున్నట్టు డ్రోన్‌ల ద్వారా గుర్తింపు
- కొత్తగా 23 చెక్‌పోస్టులు ఏర్పాటు, 350 మొబైల్ చెక్‌పోస్టులు
- 166 కేసులు నమోదు, 476 మంది అరెస్టు, 12,000 కిలోలు స్వాధీనం
- గంజాయితో దొరికితే వాహనాలు, ఆస్తులు సీజ్
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ



విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): **గంజాయి సాగు, రవాణా, అమ్మకాలు, వినియోగం వంటి వాటిని అరికట్టడానికి బహుముఖ వ్యూహం అమలు చేస్తున్నామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ తెలిపారు. గంజాయిని నిర్మూలించేందుకు అనుసరిస్తున్న విధానాలు ఇప్పటికే కొంత సత్ఫలితాలు ఇచ్చాయని, అయితే వ్యవస్థీకృతంగా ఏళ్ల తరబడి చేస్తున్న సాగు, అమ్మకాలు, రవాణాపై మరింత నిఘా పెట్టామన్నారు. సోమవారం తనను కలిసిన విలేకరులకు గంజాయి నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను డీఐజీ వివరించారు.**

గంజాయి నియంత్రణకు తాను బాధ్యతలు చేపట్టిన తరువాత పలు రకాల ప్రణాళికలు అమలు చేసినట్టు డీఐజీ గోపీనాథ్ చెప్పారు. గడచిన మూడు, నాలుగు సంవత్సరాల్లో గంజాయి సాగు చేసిన గ్రామాల వివరాలను తీసుకున్నామన్నారు. మొత్తం 195 గ్రామాల్లో గతంలో గంజాయి సాగు చేశారని, వాటిలో 125 గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతులను చేయడంతోపాటు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 215 గ్రామాల్లో 10,700 మంది రైతులకు చెందిన 10,837 ఎకరాల్లో గంజాయికి ప్రత్యామ్నాయంగా సాగు చేసుకునేందుకు కాఫీ, సిల్వర్ ఓక్, అవకాడో, డ్రాగన్, మామిడి, సీతాఫలం, నేరేడు, సపోట తదితర 22 రకాల పండ్లు, ఇతర రకాల మొక్కలు పంపిణీ చేశామన్నారు. మరో 30 వేల మంది రైతులకు 4,500 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశామని, ఇంకా పసుపు పంటను ప్రోత్సహించామన్నారు. అయినప్పటికీ గంజాయి సాగు చేసే అవకాశం ఉన్న గ్రామాల్లో సచివాలయం, ఫారెస్టు, రెవెన్యూ సిబ్బందితో ఏర్పాటుచేసిన బృందాలను సర్వే చేయించామన్నారు. సర్వే బృందాలు, కూంబింగ్ పార్టీలు ఇచ్చిన సమాచారం మేరకు 198 గ్రామాల్లో డ్రోన్‌ల సాయంతో 7,358 ఎకరాల్లో సర్వే చేయిస్తే జి.మాడుగుల, పెదబయలు మండలాల్లోని 41 గ్రామాల్లో 45 ఎకరాల్లో గంజాయి సాగు చేసినట్టు తేలిందన్నారు. ఆ పంటను ధ్వంసం చేశామన్నారు. మరికొన్ని గ్రామాల్లో డ్రోన్ సర్వే చేస్తున్నామని పేర్కొన్నారు. అయితే మారుమూల కొండవాలు ప్రాంతాల్లో కొంతమేర గంజాయి సాగుచేసే అవకాశం ఉందని

... మిగతా 6వ పేజీలో

ఘనంగా పోలి పాడ్యమి



దీప కాంతులతో మెరిసిన వరాహ పుష్కరిణి

కార్తీక మాసం ముగింపు సందర్భంగా సోమవారం అప్పన్న సన్నిధిలో పోలిపాడ్యమి పూజలు నిర్వహించారు. వేకువజామునే భారీగా భక్తులు వరాహ పుష్కరిణికి తరలివచ్చి, పవిత్ర స్నానాలు ఆచరించి, పుష్కరిణిలో దీపాలను విడిచిపెట్టారు. వేలాది దీపాలతో పుష్కరిణి దేదీప్యమానంగా కాంతులీనింది. మహిళలు అరటి డొప్పల్లో ఒత్తులు, ఉసిరికాయలను ఉంచి దీపారాధన చేశారు. ఉత్సవం సందర్భంగా పుష్కరిణి సత్రం నుంచి వరాహ పుష్కరిణి వరకు పోలీసులు వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఈఓ వేంద్ర త్రినాథరావు సూచనలతో ఘాట్ వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. దేవస్థానం గార్డులు, గోపాలపట్నం సీఐ గొలగాని వెంకటప్పారావు, ఎస్ఐ అప్పలనాయుడు అధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. - సింహాచలం, ఆంధ్రజ్యోతి

7న ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం

- ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ గ్రూపు చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్

-6వ పేజీలో

మెట్రో రైలుకు గ్రీన్‌సిగ్నల్



తొలి దశకు రాష్ట్ర ప్రభుత్వం ఓకే

- డీపీఆర్‌కు ఆమోదం
- మూడు కారిడార్లు... 46.23 కి.మీ.
- రూ.11,498 కోట్ల వ్యయం
- రెండో దశలో 30.67 కి.మీ., రూ.5,734 కోట్లు
- నిర్మాణ వ్యయం పూర్తిగా భరించాలని కేంద్రానికి వినతి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా 46.23 కి.మీ. పొడవున మూడు కారిడార్లు నిర్మిస్తారు. రెండో దశలో 30.67 కి.మీ. పొడవున మరో కారిడార్ నిర్మించనున్నారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఆమోదిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇదే సందర్భంలో గత వైసీపీ ప్రభుత్వం 2023 డిసెంబరు 29న జారీచేసిన 161వ నంబరు జీఓను రద్దు చేస్తున్నట్టు పేర్కొంది.

వైసీపీ ప్రభుత్వం విశాఖలో లైట్ మెట్రో రైలు ప్రాజెక్టుకు ప్రతిపాదనలు రూపొందించింది. అందులో 76.9 కి.మీ. పొడవున నాలుగు కారిడార్లను రూ.14,309 కోట్లతో నిర్మిస్తామని ప్రతిపాదించింది. దీనిని వయబులిటీ గ్యాప్ ఫండ్-పీపీపీ విధానంలో కేంద్ర ప్రభుత్వం నుంచి 40 శాతం తీసుకొని, మిగిలిన 60 శాతం ప్రైవేటు డెవలపర్ల నుంచి సమీకరిస్తామని అప్పుడు వెల్లడించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఒకేసారి నాలుగు కారిడార్లు కాకుండా మొదట మూడు కారిడార్లు, ఆ తరువాత మిగిలిన నాలుగో కారిడార్ నిర్మించాలని కొత్త డీపీఆర్ తయారుచేసింది. ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయం మొత్తం కేంద్రం నుంచే రాబట్టాలని ప్రయత్నం చేస్తోంది. కోల్‌కతాలో మెట్రో రైలు ప్రాజెక్టుకు కేంద్రమే పూర్తిగా నిధులు అందించిందని, అదే విధానంలో విశాఖ మెట్రోకు సాయం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఇటీవల ఢిల్లీ వెళ్లి అక్కడి పెద్దలను కోరారు.

తొలి దశలో...

మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశలో స్టీల్ ప్లాంటు నుంచి కొమ్మాది వరకు 34.4 కి.మీ.తో మొదటి కారిడార్, గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు వరకు 5.08 కి.మీ. పొడవున రెండో కారిడార్, తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకూ 6.75 కి.మీ. పొడవున మూడో కారిడార్ నిర్మిస్తారు. దీనికి అవసరమైన భూమి ధర కాకుండా రూ.11,498 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ మూడు కారిడార్లకు 99.75 ఎకరాలు అవసరమని, అందుకు మరో రూ.882 కోట్లు అవసరమని అధికారులు లెక్కగట్టారు.

రెండో దశలో కొమ్మాది నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 30.67 కి.మీ. పొడవున నాలుగో కారిడార్ నిర్మిస్తారు. దీనికి రూ.5,734 కోట్లు అవసరం. సుమారు 6.13 ఎకరాల భూమి అవసరమని, దానికి రూ.23 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

ఆర్ఈసీఎస్‌పై నేతల కన్ను

ఈపీడీసీఎల్ నుంచి వెనక్కి తీసుకునేందుకు వ్యూహం

- వాస్తవాలు దాస్తున్న నాయకులు
- గతంలో నెలకు రూ.2 కోట్లలోపు లాభం చూపిన అధికారులు, నాయకులు
- మిగిలింది దుర్వినియోగం చేశారనే ఆరోపణలు
- తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోకి వచ్చిన తరువాత రూ.127.68 కోట్లు మిగులు
- ఖర్చులు పోను రూ.85.68 కోట్ల లాభం



ఆర్ఈసీఎస్



ఈపీడీసీఎల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) **అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సరఫరా సహకార సంస్థ (ఆర్ఈసీఎస్)ను మళ్లీ వెనక్కి తీసుకోవాలని కొందరు ప్రజా ప్రతినిధులు యత్నిస్తున్నారు. లాభాలు వస్తున్న సంస్థను లాగేసుకున్నారని తప్పుడు లెక్కలు చెబుతున్నారు. నష్టాల విషయాన్ని, నిధుల దుర్వినియోగాన్ని దాచి పెడుతున్నారు.**

ఆర్ఈసీఎస్ సహకార సంస్థలో ఉన్నప్పుడు భారీగా నిధుల దుర్వినియోగం జరిగిందని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఏటా ఆర్ఈసీఎస్‌లు ప్రభుత్వ సిఫారసుతో లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి. కానీ అనకాపల్లి ఆర్ఈసీఎస్ ఆ నిబంధన ఉల్లంఘించింది. సిఫారసు లేకుండానే రెన్యువల్‌కు దరఖాస్తు చేసింది. ఈ విషయాన్ని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీఎస్) గుర్తించి అభ్యంతరం వ్యక్తంచేసింది. యూనిట్ విద్యుత్ రూ.1.40కు తీసుకొని, సగటున రూ.5కి విక్రయిస్తున్నారని, ఆ రాయితీ (మిగులు) మొత్తం ఏమి చేస్తున్నారని నిలదీసింది. సమాధానం చెప్పలేక అప్పటి ఆర్ఈసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ చేతులెత్తేశారు. దాంతో ఆర్ఈసీఎస్‌ను ఏపీ తూర్పు విద్యుత్ ప్రాంత పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) నిర్వహించాలని, ఆ తరువాత విలీనం చేసుకోవాలని ఆదేశించింది. దీంతో ఆర్ఈసీఎస్ 2021 సెప్టెంబరులో ఈపీడీసీఎల్ స్వాధీనంలోకి వచ్చింది. అప్పటి నుంచి ఎటువంటి సమస్యలు లేకుండా నడుస్తోంది.

ప్రజా ప్రతినిధులు ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించిన అంశాల ప్రకారం అనకాపల్లి ఆర్ఈసీఎస్‌కు 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.1.83 కోట్లు, 2020-21లో రూ.1.91 కోట్ల లాభం వచ్చింది. అయితే 2018-19లో రూ.1.74 కోట్ల నష్టం వచ్చింది. ఈ విషయాన్ని మాత్రం సదరు నేతలు అసెంబ్లీలో వెల్లడించలేదు. ఈపీడీసీఎల్ స్వాధీనం చేసుకున్న తరువాత 2023వ సంవత్సరంలో విద్యుత్ సరఫరా, బిల్లుల

... మిగతా 6వ పేజీలో

జనవరి 4న హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభం

- ఆరోజు బీచ్‌లో నేవీ డే విన్యాసాలు
- ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబునాయుడు హాజరు
- విశాఖ విమానాశ్రయం పౌర సేవలకు సదా సిద్ధమే
- తూర్పు నౌకాదళం చీఫ్ రాజేశ్ పెంధార్కర్



విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్‌కే బీచ్ రోడ్డులో వీఎంఆర్‌డీఏ సిద్ధం చేస్తున్న యుహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియాన్ని జనవరి 4వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులు మీదుగా ప్రారంభించనున్నట్టు తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ తెలిపారు. నేవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన ఇష్టాగోష్ఠిలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ప్రతి ఏటా నేవీ దినోత్సవం సందర్భంగా విశాఖ బీచ్‌లో సాహస విన్యాసాలు (ఆపరేషన్ డెమో)

... మిగతా 6వ పేజీలో

ఉక్కు సీఎండీపై ఊగిసలాట

సీఎండీ అతుల్ భట్‌ను రెండు నెలల క్రితం సెలవుపై పంపిన కేంద్రం

- ప్లాంటులో ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా ఉన్న అరుణ్ కంటి బాగ్చికి అదనపు బాధ్యతలు అప్పగింత
- 20 రోజులకే ఆయన్ను తొలగించి సక్సేనా నియామకం
- ఇప్పుడు పూర్తిస్థాయి సీఎండీ పదవీ విరమణ చేసినా గతంలో ఎంపిక చేసిన శక్తిమణికి అందని ఉత్తర్వులు





శక్తిమణి

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు విషయంలో కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు ఉద్యోగ వర్గాల్లో తీవ్ర ఆందోళన, అనుమానం రేకెత్తిస్తున్నాయి. సీఎండీలను ఇష్టం వచ్చినట్టు మార్చడమే దీనికి కారణం.

సెప్టెంబరు మొదటి వారం వరకూ సీఎండీగా పనిచేసిన అతుల్‌భట్‌ను ఉక్కు మంత్రిత్వ శాఖ ఆకస్మికంగా సెలవుపై పంపించేసింది. ఇక్కడే ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా ఉన్న అరుణ్ కంటి బాగ్చికి సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కొత్త సీఎండీ వచ్చేంత వరకూ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. వాస్తవానికి అతుల్‌భట్ నవంబరు 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. రెండున్నరేళ్లు ఆయన్ను కొనసాగించిన వారికి ఇంకో రెండు నెలలు ఉంచడం పెద్ద విషయం ఏమీ కాదు. కానీ ఎందుకో తప్పించారు. ఈ పోస్టు కోసం పద్ధతి ప్రకారం మూడు నెలల ముందే ప్రకటన జారీచేసి, దరఖాస్తులు స్వీకరించి 'ది ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్'లో ఫైనాన్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న

... మిగతా 6వ పేజీలో

పాడి రైతుల నిరసన



డెయిరీ గేట్లు తోసుకుంటూ లోనికి వెళుతున్న పాడి రైతులు

- విశాఖ డెయిరీ ఎదుట ఉద్రిక్తత
- పాల సేకరణ తగ్గింపుపై ఆందోళన
- గేట్లు తోసుకుంటూ లోనికి వెళ్లి ఎండీ కార్యాలయం ఎదుట బైఠాయింపు

- 8వ పేజీలో



నృసింహ దీక్షలకు శ్రీకారం

వరాహలక్ష్మీనృసింహస్వామి దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. వేదమంత్రాల మధ్య వందలాది మంది భక్తులు అప్పన్న చందన మాలలు ధరించారు.

- 8లో

పబ్‌లు,బార్‌ల ఇష్టారాజ్యం

- అనుమతులు లేకుండానే నిర్వహణ
- పోలీసుల ఆకస్మిక తనిఖీల్లో బట్టబయలు

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొన్ని పబ్‌లు, బార్‌ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పబ్‌లు, బార్‌లపై వరుసగా ఫిర్యాదులు అందుతుండడంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని పోలీసులను సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. దీంతో 150 మంది 46 బృందాలుగా ఏర్పడి ఆదివారం రాత్రి ఎనిమిది నుంచి రాత్రి 11 గంటల వరకూ 54 పబ్‌లు,

... మిగతా 6వ పేజీలో



వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజాస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాదన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

ఎన్‌హెచ్‌ఎం నూతన కార్యవర్గం

మధురవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జరిగింది. గౌరవాధ్యక్షుడిగా జి. శశిభూషణరావు, అధ్యక్షుడిగా ఆర్. సురేశ్, జనరల్ సెక్రటరీగా వి. వీరబ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేసీహెచ్ నాగరాజు ఎన్నికయ్యారు.

ఆపస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సుదర్శన్ పట్నాయక్

తగరపువలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా ఉపాధ్యక్షుడిగా తగరపువలసకు చెందిన ఉపాధ్యాయుడు జి.సుదర్శన్ పట్నాయక్ ఎన్నికయ్యారు. సోమవారం సీతమ్మధార కేశవ విద్యా నిలయంలో ఆ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు శరభన్న బాలాజీ చేతుల మీదుగా పట్నాయక్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. పట్నాయక్ గతంలో పీఆర్‌టీయూ (102) జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.

అష్టలక్ష్మీ దేవాలయంలో మార్గశిర మాసోత్సవాలు

కొమ్మాది, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో మంగళవారం నుంచి మార్గశిర మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు తెలిపారు. సోమవారం వారు ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల్లో భాగంగా 11న గీతా జయంతి, 13న హనుమత్ వ్రతం, 14న లక్ష్మీనారాయణుల నిజరూప దర్శనం జరుగుతాయన్నారు. అలాగే నాలుగు గురువారాలు అమ్మవారికి విశేషమైన అలంకరణలు, కుంకుమ పూజలు చేస్తామని తెలిపారు.

ముగిసిన నారాయణ సేవ



కొమ్మాది, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చంద్రంపాలెం జాతరగుట్ట దుర్గాలమ్మ ఆలయంలో అన్నమయ్య గురు పీఠం ఆధ్వర్యంలో అయ్యప్ప మాలలు వేసిన వారికి 41 రోజులు చేపట్టిన మహా నారాయణ సేవ సోమవారంతో ముగిసింది.ఈ సందర్భంగా మాలధారులు గురుస్వామి వెంకటరమణను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, పిళ్లా సూరిబాబు, పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, తాతారావు పాల్గొన్నారు. అలాగే అలాగే పీఎంపాలెం అయ్యప్ప అన్నదాన ట్రస్టు సభ్యులు నిర్వహించిన మహా నారాయణ సేవ కూడా ముగిసింది. ట్రస్టు నిర్వాహకులు గురుస్వామిని పరుశురాంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోతిన ఎల్లాజీ, శ్రీను, వాండ్రాసి భాస్కర్, ఎ. ప్రసాద్, పోతిన మురళీ, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ...

మధురవాడ : మానం ఆంజనేయనగర్‌లో ఉన్న లలిత త్రిపురసుందరి సమేత మహాకామేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కాలనీవాసులతో పాటు మధురవాడ, మల్లయ్యపాలెం, నగరంపాలెం ప్రాంతాల నుంచి భక్తులు హాజరై స్వామివారి ప్రసా దాన్ని స్వీకరించారు. ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేశ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. అలాగే పోలిపాడ్యమి సందర్భంగా మహిళలు చెరువులతో పాటు ఇళ్ల వద్ద కార్తీక దీపాలు విడిచిపెట్టారు.

పార్కుల నిర్వహణలో నిర్లక్ష్యం

- అధ్వానంగా బీచ్ రోడ్డులోని పార్కులు
- కనీస సౌకర్యాలు లేక సందర్శకుల అవస్థలు
- చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలు

భీమునిపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ రోడ్‌లో ఉన్న జీవీఎంసీ పార్కుల నిర్వహణ పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పార్కుల్లో సందర్శకులకు సరైన సదుపాయాలు లేవు సరికదా సగభాగం తుప్పలు, పొదలతో నిండిపోయాయి. దీంతో పాముల సంచారం ఎక్కువగా ఉండడంతో పార్కులకు వస్తున్న వారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. డస్ట్ బిన్లు ఉన్నా..



తుప్పు పట్టి పాడైన డస్ట్ బిన్లు

అవి నేలకొరగడంతో ఎవరూ ఉపయోగించడం లేదు. బీచ్ పార్కుతో పాటు గాంధీ పార్కులో గడ్డి లేకపోవడంతో మైదానం బోసిపోయినట్టు కనిపిస్తుంది. సందర్శకులు కూర్చునేందుకు వాకర్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్, ఫ్రెండ్స్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు తప్ప జీవీఎంసీ ఎటువంటి కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేయలేదు. లవ్ భీమిలి యాంబ్లమ్‌లో ఈ అక్షరం పోయింది, బుద్ధుడి విగ్రహాల్లో కొన్నింటికి చేతులు విరిగిపోయాయి. బీచ్ పార్కుకు నైరుతి దిక్కున ప్రవేశ ద్వారం మెట్లు విరిగిపోవడంతో సందర్శకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఆ ద్వారం వద్ద గుబురుగా పెరిగిన పొదలు మందుబాబులకు అడ్డాగా మారాయి. దీంతో సందర్శకులు



విరిగిన చేతులతో బుద్ధుడి విగ్రహాలు



శిథిలమైన మెట్ల మార్గం

అటుగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాత్రి పూట ఈ పొదల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. బీచ్ పార్కులో ఒక్క ఎల్ఈడీ లైటు కూడా ఏర్పాటు చేయకపోవడంతో అంధకారం నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పార్కుల అభివృద్ధిపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

7న ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం

ముఖ్య అతిథిగా ఎల్అండ్‌టీ గ్రూపు చైర్మన్ సుబ్రహ్మణ్యన్

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనాన్ని ఈ నెల ఏడో తేదీన నిర్వహిస్తున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు తెలిపారు. సోమవారం ఉదయం అలూమ్ని అసోసియేషన్ జీఎంఆర్ స్మార్ట్ సెమినార్ హాలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడో తేదీ నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ గ్రూపు చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్, ప్రత్యేక అతిథిగా పద్మశ్రీ డాక్టర్ ఎస్‌వీ ఆదినారాయణ, విశిష్ట అతిథిగా రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారన్నారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, ఎంపీ ఎం.శ్రీభరత్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు. ఇప్పటివరకూ దేశ,విదేశాలకు చెందిన సుమారు 1500 మంది పూర్వ విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని వెల్లడించారు. పూర్వ వి ద్యార్థుల సంఘం చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు మాట్లాడుతూ బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో మధ్యాహ్నం మూ డు గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అతిథులు ఉదయం వర్సిటీలోని కాలేజీలను సందర్శిస్తారన్నారు.

పూర్వ విద్యార్థులు కూడా ఉదయం నుంచే తాము చదివిన విభాగాలకు వెళ్లి గత స్మృతులను నెమరువేసుకుంటారని వెల్లడించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ కుమార్‌రాజా, కార్యదర్శి ఎ.చంద్రశేఖర్, రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు, వైస్ చైర్మన్ కుమార్‌రాజా, కార్యదర్శి చంద్రశేఖర్, రెక్టార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు, తదితరులు

45 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యుడు మల్లికార్జునరావు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నగరపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యులు సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మల్లికార్జునరావు స్థానిక విద్యార్థులతో పాటు గొల్లలపాలెం విద్యార్థులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అలాగే దివీస్ యాజమాన్యం పాఠశాలలకు అందించిన ప్రథమ చికిత్స కిట్లను ఆ కంపెనీ సామాజిక సేవా విభాగం మేనేజరు డి. సురేశ్‌కుమార్ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్‌కుమార్, మురళీకృష్ణ, దివీస్ ప్రతినిధులు శేఖర్‌బాబు, నరసింహ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఒక్కటే వినతి

భీమునిపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒక్కటే వినతి అందింది. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ఫిర్యాదు అందగా ఆ శాఖాధికారులకు పంపించినట్టు జడ్సీ ప్రసన్న వాణి తెలిపారు, ఈ కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాసరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సింహాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు వాతావరణ సమతుల్యతను కాపాడవచ్చునని జేడీ ఫౌండేషన్ గోపాలపట్నం శాఖ ప్రతినిధి ఆదిల్ అన్నారు. సోమవారం అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.విద్యార్థులకు విత్తన బంతులు తయారీపై అవగాహన కల్పించారు.

వర్షంతో రైతుల్లో ఆందోళన

పద్మనాభం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మూడు రోజులుగా పడుతున్న వర్షాలు రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.ఆకాశం పూర్తిగా మేఘావృతమై, తేలిక పాటి జల్లులు కురుస్తుండడంతో రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరదాలతో కప్పి భద్రపరుస్తున్నారు. వాతావరణంలో మార్పు వస్తే వెంటనే ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలకు తరలించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో 2594 హెక్టార్లకు గాను 1816 హెక్టార్లలలో కోతలు పూర్తయినట్టు అధికారులు తెలిపారు.

ఆందోళన చెందొద్దు : ఏఓ

తుఫాన్ ప్రభావం వల్ల మండల వ్యాప్తంగా పడుతున్న వర్షాల వల్ల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ ఎంవీ చలం చెప్పారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే దాదాపుగా వరి కోతలు పూర్తయ్యాయని, సుమారు 500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల క్రితమే కోతలు వాయిదా వేసుకోవాలని సూచించామన్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే వారం రోజుల పాటు కోతలు వాయిదా వేసుకోవాలని తెలిపారు.

డేటా సైన్స్‌పై అవగాహన

సాగర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఐటీ రంగంలో ప్రాధాన్యత ఉన్న కృత్రిమ మేధ, డేటా సైన్స్‌పై గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) విభాగం విద్యార్థులకు సోమవారం కేస్ స్టడీ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు డేటా సైన్స్‌లో ఎదురవుతున్న సవాళ్లకు సైంటిఫిక్ పోస్టర్ రూపంలో పరిష్కార మార్గాలను ప్రదర్శించారు. మొత్తం 28 జట్లు పోటీలో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సీఎస్ఈ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్. అరుణ్‌కుమార్, అసోసియేటర్ డీన్ ప్రొఫెసర్ సీహెచ్ శాంతి, డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీఎస్ రాజ్‌కుమార్, సీఎస్ఈ విభాగం అధిపతి ప్రొఫెసర్ జి. లక్ష్మీశ్వరి, కె. నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు సీఎండీపై ఊగిసలాట

... 5వ పేజీ తరువాయి

శక్తిమణిని ఆర్ఐఎన్ఎల్ సీఎండీగా ఎంపిక చేశారు. ఈ విషయాన్ని సెప్టెంబరు మూడో తేదీన ప్రకటించారు. అతుల్‌భట్‌ను సెలవుపై పంపినప్పుడు శక్తిమణికి అవకాశం ఇవ్వాలి. కానీ అలా చేయకుండా ప్రాజెక్టు డైరెక్టర్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఇరవై రోజులు కాగానే ఆయన్ను కూడా తప్పించారు. సెప్టెంబరు 30న మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఓఐఎల్) సీఎండీ అజిత్‌కుమార్ సక్సేనాను తీసుకువచ్చి సీఎండీ సీట్లో కూర్చోబెట్టారు. ఆదివారం రోజున ఆయన నియామకపు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు కొనసాగాలని సూచించారు. నిబంధనల ప్రకారం చూస్తే అధికారిక సీఎండీ అతుల్‌భట్ నవంబరు 30వ తేదీన పదవీ విరమణ చేసినందున కమిటీ ఎంపిక చేసిన శక్తిమణికి అవకాశం ఇవ్వాలి. కానీ ఆయనకు ఇంకా ఆదేశాలు ఇవ్వలేదు. ఇంకొన్నాళ్లు సక్సేనానే కొనసాగించాలని నిర్ణయించినట్టు సమాచారం. సక్సేనా బాధ్యతలు చేపట్టాక బ్యాంకుల్లో నిధులు ఉన్నా ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదు. సెప్టెంబరు జీతం 50 శాతం, అక్టోబరు నెల 35 శాతం జీతం బకాయిలు పెట్టారు. నవంబరు నెల జీతాలకు సంబంధించి 9వ తేదీ వరకు ఎటువంటి ప్రతిపాదనలు తయారు చేయవద్దని ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది. అంటే పదో తేదీ వరకూ జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. జీతాల కోసం ఉద్యోగులు ఫైనాన్స్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తే వారందరిని గుర్తించి నోటీసులు జారీచేశారు. మరోసారి ధర్నాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాంతో ఉద్యోగుల కుటుంబ సభ్యులను రోడ్లపైకి వచ్చి జీతాల కోసం ఆందోళన చేస్తున్నారు. ఏం చేసినా వారికి సకాలంలో జీతాలు ఇవ్వడానికి సీఎండీ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఇక్కడి పరిస్థితిని విశాఖ ఎంపీ శ్రీభరత్ స్వయంగా కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి దృష్టికి తీసుకువెళ్లినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోవడం గమనార్హం.

పబ్‌లు,బార్‌ల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

బార్‌లలో తనిఖీలు చేశారు. నాలుగు పబ్‌లు/బార్‌లకు అసలు మద్యం విక్రయించేందుకు ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి లేదని ఈ సందర్భంగా గుర్తించారు. అలాగే మూడు పబ్‌లు, బార్‌లకు ఆహార పదార్థాలు విక్రయించేందుకు ఫుడ్ కంట్రోల్ డిపార్టుమెంట్ అనుమతి లేదని, 12 పబ్‌లు/బార్‌లకు పార్కింగ్ స్థలం లేదని, 14 పబ్‌లు/బార్‌లకు ఫైర్ డిపార్టుమెంట్ నుంచి నిరభ్యంతర ధృవీకరణ పత్రం లేదని, రెండు పబ్‌లు/బార్‌లు సీసీ కెమెరాలు ఏర్పాటుచేయలేదని, మరో మూడు పబ్‌లు/బార్‌లకు సరైన కిచెన్ లేదని, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారని గుర్తించారు. 12 బార్‌లలో ఎంఆర్‌పీకి మించి మద్యాన్ని విక్రయిస్తున్నట్టు గుర్తించారు. వారందరిపై చర్యలకు సంబంధిత శాఖలకు నివేదికలు పంపిస్తామని సీపీ తెలిపారు.

గోస్తనీలో దీప కాంతులు

- ఘనంగా పోలి పాడ్యమి పూజలు
- తెల్లవారుజామున 2 గంటల నుంచే సంగమం వద్ద మహిళల సందడి

భీమునిపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ పోలి పాడ్యమి పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. భీమిలిలో తెల్లవారుజామున 2 నుంచే మహిళలు గోస్తనీ సాగర సంగమం తీరానికి చేరుకుని దీపాలు విడిచిపెట్టారు. అనంతరం శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేణు గోపాలస్వామి, మెయిన్ రోడ్‌లో వున్న చోడేశ్వరాలయం,భీమేశ్వరాలయం, చంద్రశేఖరాలయం, రిప్పన్ శివాలయం భక్తులతో కిటకిటలాడాయి.

పద్మనాభం రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు తెల్లవారుజామున గోస్తనీ నదిలో పుణ్య స్నానాలు అచరించి, నదిలో దీపాలు



సంగమంలో దీపాలు వదులుతున్న మహిళలు

వదిలారు. అనంతరం సమీపంలోని శివాలయాల్లో పూజలు నిర్వహించారు. కార్తీక మాసం ముగింపు సందర్భంగా కొన్ని గ్రామాల్లో అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని నగరపాలెం వద్ద గోస్తనీ నది పుష్కర ఘాట్‌లో వందలాది మంది మహిళలు తెల్లవారుజాము నుంచి దీపాలు వెలిగించి, నదిలో వదిలారు. అనంతరం అక్కడ ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. పుష్కర ఘాట్ వద్ద ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచే తగరపువలస, భీమిలి మండలంలోని పలు గ్రామాలు, మధురవాడ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సర్పంచ్ చాయా గౌతమి, చంద్రశేఖర్ భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో చర్చిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలు వాయిదా

- ఫిబ్రవరి నెలకు మార్పు
- సీఎంను ఆహ్వానించాలని నిర్ణయం
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వందేళ్ల ఉత్సవాలను వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలకు వాయిదా వేసినట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన నగరంలోని ఎంవీపీ కాలనీలో ఉన్న తన నివాసంలో ఉత్సవ కమిటీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో చాలా తక్కువ హైస్కూళ్లకు మాత్రమే వందేళ్ల చరిత్ర ఉంటుందని, ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు జరగాలన్నారు. స్కూల్ భవనానికి ఆధునికీకరణ పనులు చేపట్టడానికి తగిన సమయం లేకపోవడంతో ఈనెల 28, 29 తేదీల్లో జరగాల్సిన ఉత్సవాలను వాయిదా వేసినట్టు చెప్పారు.కమిటీ సూచన మేరకు ఫిబ్రవరి 22, 23 తేదీల్లో ఉత్సవం జరుగుతుందన్నారు. దీనికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆహ్వానించాలని నిర్ణయించినట్టు తెలిపారు. సమావేశంలో భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, డీఈఓ ప్రేమ్‌కుమార్, జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి, ఎస్ఎస్ఏ ఈఈ నరసింహారావు, దివీస్ ప్రతినిధి సురేశ్, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ చైర్మన్ గాదు అప్పలనాయుడు,పార్వతీశం, బసవ కృష్ణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు రాజు, పార్టీ నాయకులు గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

అభిప్రాయపడుతూ, వీటిని గుర్తించేందుకు కూంబింగ్ పార్టీలు యత్నిస్తున్నాయన్నారు. ఏజెన్సీ నుంచి గంజాయి రవాణాను అరికట్టేందుకు అనేక రకాల చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటివరకూ ఉన్న 13 చెక్‌పోస్టులకు అదనంగా 23 చెక్‌పోస్టులు ఏర్పాటుచేశామని డీఐజీ గోపీనాథ్ వెల్లడించారు. ఒక్కొక్క చెక్‌పోస్టులో మూడు షిఫ్టులలో నలుగురేసి సిబ్బంది విధులు నిర్వహిస్తారని వివరించారు. 11 చెక్‌పోస్టుల వద్ద డాగ్ స్క్వాడ్‌లు ఏర్పాటుచేశామన్నారు. వీటికితోడు 350 మొబైల్ చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయన్నారు. చెక్‌పోస్టుల ద్వారా 166 కేసులు నమోదుచేసి, 476 మందిని అరెస్టు చేసి వారి నుంచి 12 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి రవాణాలో నిందితులుగా ఉంటూ తప్పించుకు తిరుగుతున్న 729 మందిని అరెస్టు చేశామన్నారు. పలు రాష్ట్రాలకు చెందిన సుమారు 120 గ్యాంగ్‌లను గుర్తించామని, వీరిలో పలువురిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. గంజాయి రవాణాకు సంబంధించి 25 కేసులలో నిందితులకు 10 నుంచి 25 సంవత్సరాల జైలు శిక్ష పడిందని, భవిష్యత్తులో మరిన్ని కేసుల్లో శిక్షలు పడేలా చార్జిషీట్లు పక్కాగా రూపొందిస్తున్నామని డీఐజీ గోపీనాథ్ చెప్పారు. అదేపనిగా గంజాయి వ్యవహారాలతో సంబంధం ఉన్న 21 మందిపై పీడీ యాక్టు అమలు చేస్తున్నామని వెల్లడించారు. మరో 247 మంది అనుమానితులపై గంజాయి కేసులు (గంజాయి షీట్స్) నమోదుచేయగా, మరొకరిపై రౌడీషీట్ ఓపెన్ చేశామన్నారు. గంజాయితో దొరికే వ్యక్తుల వాహనాలు, ఆస్తులు సీజ్ చేయాలని నిర్ణయించామన్నారు. ఏజెన్సీలో గతంలో పండించిన గంజాయి భారీగా నిల్వ ఉందని అనుమానం వ్యక్తంచేశారు. ఏజెన్సీలో పలు గ్రామాలతోపాటు నర్సీపట్నం నుంచి మాడుగుల వరకూ, అనకాపల్లి, విశాఖ నగర శివారుల్లో కొంతమంది వద్ద నిల్వలు ఉన్నాయని త్వరలో దాడులు చేస్తామని వెల్లడించారు. గంజాయి వినియోగంపై సంకల్పం పేరుతో ప్రారంభించిన కార్యక్రమానికి మంచి స్పందన లభించిందన్నారు. రెండు లక్షల మంది విద్యార్థులను, వేలాది మంది ఉద్యోగులను చైతన్యవంతులను చేశామన్నారు. గంజాయి అమ్మకాలు, వినియోగంపై సమాచారం అందించేందుకు 150 చోట్ల బాక్సులు ఏర్పాటుచేశామన్నారు. గంజాయికి దూరంగా ఉండేందుకు 'యుద్ధం' పేరుతో కొత్త కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. ఏజెన్సీ సందర్శనకు వచ్చే పర్యాటకులు గంజాయి రవాణా, వినియోగానికి దూరంగా ఉండాలని డీఐజీ పిలుపునిచ్చారు. పర్యాటక ప్రాంతాల్లోని హోటళ్లు, రిసార్టులలో గంజాయికి వ్యతిరేకంగా పోస్టర్లు అతికించామని వివరించారు.

ఆర్ఈసీఎస్‌పై నేతల కన్ను

... 5వ పేజీ తరువాయి

వసూళ్లు, ఖర్చులు, లాభం చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. అవే వనరులు, అదే ఉద్యోగులతో ఈపీడీసీఎల్ ఆర్ఈసీఎస్‌ను నడుపుతోంది. 2023 జనవరి నుంచి డిసెంబరు నెలాఖరు వరకు రూ.161.52 కోట్లు బిల్లుల రూపంలో వసూలైంది. అంటే నెలకు రూ.12 కోట్లపైనే వచ్చింది. ఆ ఏడాది వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.4.46 కోట్లు చెల్లించింది. ఉద్యోగులకు జీతాలు, చిల్లర ఖర్చులకు రూ.29.37 కోట్లు అయ్యాయి. దీంతో రూ.127.68 కోట్లు మిగిలింది. గతంలో ఆర్ఈసీఎస్‌కు ఈపీడీసీఎల్ సరఫరా చేసిన విద్యుత్‌కు యూనిట్‌కు రూ.1.40 మాత్రమే వసూలు చేసేది. 2023లో ఆర్ఈసీఎస్‌కు సుమారు 30 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. దానికి ఆ రేటు ప్రకారం చూసుకుంటే రూ.42 కోట్ల వరకు బిల్లింగ్ చేయాల్సి ఉంటుంది. ఆ మొత్తం కూడా మినహాయిస్తే నికరంగా 2023లో రూ.85.68 కోట్లు మిగిలినట్టు. అవే ఏర్పాట్లు, అదే సిబ్బంది, అదే బిల్లింగ్...లెక్కలు మాత్రం వేరు. నాడు రెస్కో చూపించిన ఖర్చులు వేరు. ఇప్పుడు అయిన ఖర్చులు వేరు. అదే తేడా. అనకాపల్లి నేతలు అసెంబ్లీలో రెండేళ్ల లాభం లెక్కలు చూపించారు. ఒక్క ఏడాది కూడా రూ.2 కోట్లు లేదు. కానీ ఈపీడీసీఎల్ నుంచి సమాచార హక్కు చట్టం కింద సేకరించిన వివరాల ప్రకారం ఒక్క 2023లోనే రూ.85.68 కోట్లు మిగిలాయి.

ఈపీడీసీఎల్ నుంచి యూనిట్ రూ.1.40 చొప్పున తీసుకుని సగటున రూ.5 చొప్పున అమ్ముకుంటున్నారు. అంటే యూనిట్‌కు రూ.3.60 మిగులుతోంది. సొసైటీ కాబట్టి దీనిని సభ్యులకు డివిడెండ్ రూపంలో పంచాలి. కానీ రూ.2 కోట్ల కంటే తక్కువ లాభం చూపించి, మిగిలిన మొత్తం అంతా రకరకాల ఖర్చుల పేర్లతో సొసైటీ అధికారులు, ఆ ప్రాంత నాయకులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్ఈసీఎస్ చేజారిపోకుండా గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు చేయని ప్రయత్నం లేదు. ప్రభుత్వం నుంచి సిఫారసు లేఖ ఇప్పించారు. కొంతమంది వద్ద రూ.లక్షలు తీసుకుని ఉద్యోగులుగా నియమించారనే ఆరోపణలు కూడా వచ్చాయి. అధికారంలో ఎవరు ఉన్నా ఆర్ఈసీఎస్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి ఈపీడీసీఎల్ నుంచి వెనక్కి తీసుకుని లైసెన్స్ ఇప్పించాలని కొందరు కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. దీనికి ఉత్తరాంధ్రకు చెందిన ఒక కీలక నేత సహకారం అందిస్తున్నట్టు చెబుతున్నారు.

జనవరి 4న హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

ప్రదర్శించేవారమని, ఈసారి ఈ కార్యక్రమం పూరీలో ఏర్పాటుచేశామన్నారు. విశాఖ ప్రజలకు అసంతృప్తి లేకుండా జనవరి 4న ఆపరేషన్ డెమో నిర్వహిస్తామని చెప్పారు. దీనికి కూడా సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా వస్తారన్నారు.

- విశాఖపట్నం విమానాశ్రయం పౌర సేవలకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని, అందుకు అవసరమైన మౌలిక వసతులన్నీ ఉన్నాయన్నారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైన తరువాత కూడా ఈ విమానాశ్రయం ఉపయోగించుకుంటామంటే తమకు ఏమీ అభ్యంతరం లేదన్నారు.
- తీర ప్రాంతం (బీచ్)లో నిర్మించే అత్యంత ఎత్తైన భవనాలకు నేవీ నుంచి నిరభ్యంతర ధ్రువపత్రం (ఎన్‌ఓసీ) అవసరమన్నారు. జిల్లా అధికారులతో కూడిన కమిటీలో నిబంధనల మేరకు అవసరమైన వాటికి ఎన్‌ఓసీలు ఇస్తామన్నారు. రక్షణపరమైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టంచేశారు.
- విమాన వాహక నౌక (ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్) విక్రాంత్ విశాఖపట్నం కేంద్రంగానే పనిచేస్తుందని, అయితే అతి పెద్ద నౌక కావడంతో అది నేవల్ డాక్‌యార్డులోకి రాలేదని, దాని కోసం ప్రత్యేకంగా అవుటర్ హార్బర్‌లో జెట్టీ నిర్మాణం చేయాలని, దీనికి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయన్నారు.
- విజయనగరం సమీపానున్న బాడంగి ఎయిర్‌స్ట్రిప్‌లో ప్రస్తుతం నేవీ కార్యక్రమాలు ఏమీ నిర్వహించడం లేదని స్పష్టంచేశారు.
- విశాఖపట్నం పరిసరాల్లో మొక్కల పెంపకానికి సంబంధించి 1.4 కోట్ల విత్తన బంతులు ఏడాది కాలంలో వెదజల్లామని చెప్పారు.

30న పోస్టల్ అదాలత్

ఎంవీపీ కాలనీ,డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని పోస్టల్ అడ్మినిస్ట్రేటివ్ కాంప్లెక్స్ భవనంలో ఈనెల 30న ఉదయం 11 గంటలకు 102వ పోస్టల్ డాక్ / పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఆర్ఎంఎస్ వి డివిజన్ సూపరింటెండెంట్ ప్రసన్నరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్ఎంఎస్ (రైల్వే మెయిల్ సర్వీసెస్) వి డివిజన్ పరిధిలోని ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వారు తపాలా సేవలు, పింఛన్ల వ్యవహారాలు, ట్రాన్స్మిషన్ ఆఫ్ మెయిల్స్, స్పీడ్ పోస్టు పార్శిళ్లు, మనీ ఆర్డర్లకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదులను ఈనెల 23వ తేదీలోగా సూపరింటెండెంట్, ఆర్ఎంఎస్-వి-డివిజన్ పేరుతో ఎంవీపీ కాలనీలోని పోస్టల్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయానికి పంపించాలని ఆయన సూచించారు.

పలు రైళ్లు మళ్లింపు

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 4, 6, 7, 9, 11, 13, 14 తేదీల్లో ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351).... ఈ నెల 4, 11న జసిదిహ్-తంబరం ఎక్స్‌ప్రెస్ (12376)... ఈ నెల 7, 14న హటిమా-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (18637)...ఈ నెల 6, 13న టాటానగర్-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12889) ....ఈనెల 2, 19న హటియా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (22837) రైళ్లు నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయని పేర్కొన్నారు.

వ్యక్తిని బెదిరించిన ముగ్గురి అరెస్టు

సీతంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి రైల్వే స్టేషన్ బస్టాప్ వద్ద గుర్తుతెలియని ముగ్గురు యువకులు ఓ వ్యక్తిని బెదిరించి రూ. 80 నగదు, బ్లూటూత్ లాక్కోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు వారిని పట్టుకున్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన మహంతి రామకృష్ణ నాయుడు సోమవారం రాత్రి రైల్వేస్టేషన్ సమీపంలోని సీఎంఆర్ బస్టాప్ వద్ద నిరీక్షిస్తుండగా ముగ్గురు యువకులు బెదిరించారు. అతని వద్ద ఉన్న బట్ నెక్ బ్లూ టూత్, పర్సులోని రూ. 80 లాక్కున్నారు. బాధితుడు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సాంకేతిక నైపుణ్యంతో ఆ ముగ్గురిని పట్టుకున్నారు.విజయవాడ వాసి జంప హరి (22), రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన జాజుల నాగరాజు (25), మధురవాడ కొమ్మాది ప్రాంతీయుడు దర్నల సంతోష్ (23)ను పోలీసులు అరెస్టు చేశారు.

టేబుల్ టెన్నిస్‌లో పతకాలు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి బాలుర బాలికల టేబుల్ టెన్నిస్ టోర్నీలో విశాఖ చిన్నారులు పతకాలు సాధించారు. నంద్యాలలో జరిగిన ఈ టోర్నీ టీం ఈవెంట్‌లో బాలికల జట్టు రన్నరప్ ట్రోఫీని సాధించగా, బాలుర జట్టు తృతీయ స్థానం దక్కించుకుంది. పతకాలు సాధించిన చిన్నారులతోపాటు కోచ్‌గా వ్యవహరించిన కన్నబాబును జిల్లా విద్యాశాఖాధికారి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి దేవుడు అభినందించారు.

సినిమా గైడ్

● **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
● **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
● **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)
● **లక్కీ భాస్కర్:** వెంకటేశ్వర
● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 46, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 32, క్యారెట్ 60 దొండకాయ 32, బంగాళదుంపలు 36, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరు చిక్కుడు 28 దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 50, కీరదోస 28, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 38, కంద 58,దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్ర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	605
విజయనగరం	609
శ్రీకాకుళం	609

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210


బూత్ బంగ్లాలా ఉన్న కల్యాణ మండపం


విరిగిపోయిన ఇనుప గేట్లు, కూలిన ప్రహరీ


కూలిపోయే స్థితిలో ఉన్న వంటశాల

శిథిలావస్థలో వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపం

» నిర్లక్ష్యంగా వదిలేసిన వైసీపీ ప్రభుత్వం
» రూ. 4 కోట్లతో ప్రతిపాదనలు చేసినా.. ఫలితం శూన్యం
» శుభకార్యాల నిర్వహణకు స్థానికుల అవస్థలు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఒకటో సెక్టరులో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో గతంలో చిన్న కల్యాణ మండపం ఉండేది. మధ్య తరగతి, పేదలకు చాలా ఉపయోగకరంగా ఉండేది. తక్కువ అద్దెకు భవనం లభిస్తుండడంతో ఆ ప్రాంతీయులే కాకుండా ఆరిలోవ, పెద వాల్తేరు, సీతమ్మధార వంటి ప్రదేశాల వారు కూడా ఫంక్షన్లు చేసుకునేవారు. అలాంటి వేదికను కొన్నాళ్లుగా అధికారులు నిర్లక్ష్యం చేశారు. కనీస మరమ్మతు చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. కొన్నాళ్లుగా వినియోగంలో లేకపోవడంతో బూత్ బంగ్లాలా మారింది. గత ఏడాది ఆగస్టులో రూ. 4 కోట్ల ప్రతిపాదనతో మినీ కన్వెన్షన్ హాలు నిర్మిస్తామంటూ అధికారులు హడావిడి చేశారు. 4.15 కోట్లతో దీన్ని అభివృద్ధి చేస్తామని అప్పటి వీఎమ్మార్డీఏ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల 2023 ఆగస్టు 14న శంకుస్థాపన కూడా చేశారు. అప్పటి మంత్రులు విడదల రజిని, ఆదిమూలపు సురేష్, మేయర్ హరి వెంకటకుమారి, ఎంపీలు విజయసాయిరెడ్డి, ఎంవీవీ సత్యనారాయణ, పి. రవీంద్ర తదితరులు శిలాఫలకం కూడా ఏర్పాటుచేశారు. అంతే ఇప్పటివరకూ దానికి అతీగతి పట్టించుకున్న నాథుడే లేడు. కల్యాణ మండపంతో పాటు శిలాఫలకం కూడా శిథిలావస్థకు చేరుకుంది తప్ప, ఒక్క ఇటుక కూడా ఇక్కడ పేర్చలేదు. అధికారులు గాని, అప్పటి ప్రజా ప్రతినిధులు గాని దీని గతేంటో పట్టించుకోలేదు.

ఎటుచూసినా అధ్వానమే

ఎదురుగా అందమైన ఉద్యానవనం, చుట్టూ నివాసిత భవనాలు, చక్కని రహదారులు, జాతీయ రహదారికి కూతవేటు దూరం కావడంతో ఈ కల్యాణ మండపానికి ఎప్పుడూ డిమాండ్ ఉండేది. సాధారణంగా ఏ మూహూర్తానికి ఇది ఖాళీగా ఉండేది కాదు. అంతటి ప్రజాదరణ కలిగిన ఈ మండపాన్ని అప్పటి అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ప్రధాన ద్వారం ఇనుప గేటు రెండువైపులా ఒరిగిపోయి ఉంది. ముందు, వెనుక ప్రహరీలు పడిపోయాయి.భవనం పక్కన వంటశాల పడిపోయే పరిస్థితిలో ఉంది. మేడపైకి ఉన్న మెట్లు ఏ క్షణం అయినా కూలిపోతాయేమో అన్నట్లున్నాయి. పరిసరాలు చెత్తాచెదారంతో నిండి ఉన్నాయి. వర్షం వస్తే పరిసరాల నుంచి విపరీతమైన దుర్వాసన వస్తోంది. కిటికీలు పూర్తిగా పగిలిపోయి ఉన్నాయి. కాగా ఈ విషయమై వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన పత్రాలను తీసి పరిశీలిస్తున్నాం. నిధులు పరిస్థితి చూసి, భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి ఏం చేయాలో ప్రణాళిక తయారు చేస్తామని చెప్పారు.


రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు


కొత్త వెంకోజీపాలెం శివాలయం ఆవరణలో పూజలు


ఆరిలోవలో : దీపోత్సవం చేస్తున్న మహిళలు

భక్తి శ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు

వెంకోజీపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్నిచోట్లా పోలి పాడ్యమి పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. మహిళలు తెల్లవారుజామున మూడు గంటల నుంచే ఆలయాల వద్ద బారులు తీరారు.1001, 501, 108 ఒత్తులు తయారు చేసి, ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన కొలనులో అరటి దిబ్బెలపై వదిలారు. అనంతరం బ్రాహ్మణులకు వాయినాలను ఇచ్చారు. కొత్త వెంకోజీపాలెం గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయంలో అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాశ్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మ భక్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతవెంకోజీపాలెం సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కొలనులో మహిళలు దీపాలు వదిలారు. అనంతరం అర్చకుడు రంపా రామ్మోహన్‌శర్మ, రంపా మురళీ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ఆరిలోవ : కార్తీక మాసంలో భక్తి శ్రద్ధలతో పూజలు చేసిన మహిళలు పోలుపాడ్యమి సందర్భంగా అరటి డొప్పల్లో ఒత్తులు వేసి దీపారాధన అనంతరం నీటిలో వదిలారు. ఈ సందర్భంగా మహిళలు వేకువ జామున ఆలయాలకు వెళ్లి తెప్పలు వదిలి, దీపారాధన అనంతరం పార్వతీపరమేశ్వరుల్ని, కేశవమూర్తులను దర్శించుకున్నారు. అన్ని ఆలయాల వద్ద నిర్వాహకులు నీటి మడుగులను ఏర్పాటు చేయడంతో అందులో మహిళలు అరటి డొప్పలు వదిలారు. పెదగదిలి, ఆరిలోవ డ్రైవర్స్ కాలనీలోని శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



శిక్షణ పొందిన మహిళలతో ఎమ్మెల్యే వెలగపూడి

మహిళలు స్వయం ఉపాధి పొందాలి

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకునే దిశగా ప్రయత్నించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సూచించారు. సోమవారం ఆదర్శనగర్ వద్ద ధరణి సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణ పొందిన వారికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించాలని నిర్వాహకులకు తెలిపారు. అనంతరం సొసైటీ ద్వారా వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాళ్ల శంకర్, సొసైటీ కార్యదర్శి కల్యాణి, వాలంటీర్లు వెంకటలక్ష్మి, ఎర్రమ్మ, సుశీల, గాయత్రి, జాతీయ యువజన అవార్డు గ్రహీత హరి వెంకటరమణ పాల్గొన్నారు.


టెన్త్ విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదోతరగతి పరీక్షలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సిద్ధం చేయడానికి పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ ఖరారు చేసింది. డిసెంబరు ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 10 వరకు ఏ రోజు ఏమి బోధన చేయాలి, విద్యార్థులను ఎలా సన్నద్ధం చేయాలి ? చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సందేహాలు నివృత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన 100 రోజుల ప్రణాళికను జిల్లా విద్యాశాఖకు పంపింది. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థి ఎలా చదువుతున్నాడు ? వెనుకబడి ఉన్నాడా ? అన్నది టీచర్లు గుర్తించాలి. అవసరమైతే అదనపు తరగతులు నిర్వహించాలని, ప్రతిరోజూ పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది.

ఆదివారం కూడా తరగతులు నిర్వహించాలని, బాలికల విషయం జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి విద్యార్థి సమాచారం తల్లిదండ్రులకు అందించాలని పేర్కొన్నారు.

సమాజంలో స్వార్థం పెరుగుపోతోంది

సినీ నటుడు రవిప్రకాశ్


కప్ప స్తంభం వద్ద నటుడు రవిప్రకాశ్

సింహాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో స్వార్థం పెరిగిపోయి, విలువలు అంతరించిపోతున్నాయని సినీ నటుడు రవిప్రకాశ్ అన్నారు. విశాఖలో ఉంటున్న తన తల్లిదండ్రులను చూసేందుకు వచ్చిన ఆయన సోమవారం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ విశాఖలో ప్రాథమిక విద్యఇంటర్ పూర్తి చేశా నని చెప్పారు. రష్యాలో ఎంఎస్ చేసి అనుకోకుండా హైదరాబాద్ వెళ్లి రామోజీరావు సహకారంతో సినీ రంగంలో ప్రవేశించానని తెలిపారు. బీఏ రమణ దర్శకత్వంలో 'శుభవేళ' అనే సినిమాలో హీరోగా తొలి సినిమా చేశానని, తరువాత సీతయ్య, 1,2,3 ప్రేమ్ అమలాపురం సినిమాల్లో నటించానన్నారు. ఇప్పటివరకు 200 సినిమాల్లో సహాయక పాత్రల్లో నటించినట్టు చెప్పారు. ప్రస్తుతం బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో సిద్దు జొన్నలగడ్డ హీరోగా చేస్తున్న సినిమాలో నటిస్తున్నానని తెలిపారు. కాగా రవి ప్రకాశ్‌కు ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు ఆహ్వానం పలకగా అంతరాలయంలో పూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా అధికారులు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.


పొగ మంచు కమ్మిన ఆరిలోవ ప్రాంతం

శ్రమ జీవుల ఉపాధిని దెబ్బతీసిన తుఫాన్

ఆరిలోవ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా తుఫాన్ ప్రభావం శ్రమజీవుల ఉపాధిని దెబ్బతీసింది. ముసురు కారణంగా ఆరిలోవ ప్రాంతం చిత్తడిగా మారింది. రెక్కాడితేగాని డొక్కాడని కూలీలు పనులు చేసే దారిలేక ఆదాయం సంపాదించలేని పరిస్థితి నెలకొంది. రోడ్డుపక్కన చిరు వ్యాపారులకు రాబడి మార్గం మూసుకుపోయింది. టిఫిన్ సెంటర్ల నిర్వాహకులకు ఆదాయం రావడం లేదు సరికదా పెట్టుబడి కూడా నష్టపోయారు. ముసురు పట్టడంతో రోడ్డుపై తోపుడు బండ్లు పెట్టుకుని అమ్ముకోలేకపోతున్నారు. అల్పాహారం తయారు చేసి విక్రయించాలనుకున్న వారి వస్తు సామగ్రి పాడైందని వాపోయారు. సోమవారం రోజంతా పొగమంచుతో దారి మూసుకుపోయింది.

రైళ్లలో ఆహార నాణ్యత, అధిక ధరల వసూలుపై తనిఖీలు

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికులకు అందించే ఆహార, పానీయాల నాణ్యత, ప్రమాణాలు, ధరల పరిశీలనపై వాల్తేరు డివిజన్ ప్రత్యేక డ్రైవ్‌లు ప్రారంభించింది. ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేయడం, డిజిటల్ చెల్లింపులకు అనుమతించకపోవడం వంటి ఫిర్యాదులపై వాణిజ్య విభాగం 20 మంది ప్రత్యేక సిబ్బందితో డ్రైవ్‌లు నిర్వహించింది. సోమవారం విశాఖ రైల్వే స్టేషన్‌లోని ఫుడ్ స్టాల్స్‌తోపాటు వివిధ రైళ్లలో ప్యాంటీకార్ కోచ్‌లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నిబంధనల ప్రకారం ఆహార నాణ్యత, ప్రమాణాలు పాటించని స్టాల్స్ యజమానులకు జరిమానాలు విధించారు. ప్రయాణికుల నుంచి అధిక ధరలను వసూలు చేస్తున్నవారికి జరిమానా విధించి హెచ్చరించారు. ప్లాట్‌ఫామ్, రైల్లో అనధికార విక్రయదారులను పట్టుకుని ఆర్పీఎఫ్‌కు అప్పగించారు. ఇలాంటి తనిఖీలు నిర్విరామంగా కొనసాగించి ప్రయాణికులకు నాణ్యతమైన ఆహార పానీయాలు అందేలా చూస్తూ, అక్రమార్కులను కట్టడి చేస్తామని సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అనంత పద్మనాభుని ఆలయ హుండీ ఆదాయం రూ.3.87 లక్షలు

పద్మనాభం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని ఆలయ హుండీ ద్వారా ఈ ఏడాది రూ. 3,86,951 ఆదాయం లభించింది. ఆలయ హుండీని గత ఏడాది డిసెంబరు 13 నుంచి ఈ ఏడాది డిసెంబరు 2 వరకు లెక్కించగా ఈ ఆదాయం వచ్చింది. ఏటా దీపోత్సవం అనంతరం హుండీ ఆదాయాన్ని లెక్కిస్తారు. దీపోత్సవం సందర్భంగా టికెట్లు, విరాళాల ద్వారా రూ. లక్ష ఆదాయం లభించింది. ఆలయ ఈఓ ఎస్.నానాజీబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీధర్,ఆలయ అర్చకులు వెంకటాచారి, పవన్, నాయకులు ఎర్నాయుడు, పైడిరాజు పాల్గొన్నారు.


కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పితానిదిబ్బపై తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై చర్యలకు వినతి

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలోని పితానిదిబ్బలో నివాసితుల స్థలాలు కాజేయడానికి తప్పుడు పత్రాలు సృష్టించిన వ్యక్తులతో పాటు వారికి సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కోరారు. సోమవారం ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెలగపూడి మాట్లాడుతూ సుమారు ఏడున్నర దశాబ్దాల నుంచి పితానిదిబ్బలో సర్వే నంబరు 1050లో రెండు వేలకు కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వారికి జీవో 296 మేరకు 2016లో స్థలాలను క్రమబద్ధీకరించారని తెలిపారు. అయితే కొంతమంది తప్పుడు పత్రాలు సృష్టించి కోర్టును ఆశ్రయించి పితానిదిబ్బ తమదంటూ తీర్పు పొందారన్నారు. అప్పట్లో సెటిల్‌మెంట్ అధికారి జారీ చేసినట్టుగా తప్పుడు పత్రాలు కోర్టుకు సమర్పించారన్నారు. దీనిపై జోక్యం చేసుకుని తప్పుడు పత్రాలు సృష్టించిన వ్యక్తులు, వారికి సహకరించిన అధికారులపై చర్యలకు తీసుకోవాలని కోరారు. అలాగే రవీంద్రనగర్ చివరి బస్టాఫ్ నుంచి విశాఖ వ్యాలీ స్కూలు జంక్షన్ వరకు రోడ్డు నిర్మాణానికి ఉన్న అడ్డంకులను కూడా తొలగించాలని విన్నవించారు.

మూడు రోజుల్లో సమస్యల పరిష్కారానికి ఆదేశం


వినతులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

వెంకోజీపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన వినతులపై మూడు రోజుల్లో చర్యలు తీసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తితో కలిసి ఆమె వినతులు స్వీకరించారు. 90 వినతులు వచ్చాయని ఆమె తెలిపారు. మేయర్ మాట్లాడుతూ పలు జోన్‌లలోని వివిధ విభాగాల నుంచి సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

సోషల్ వర్క్ విభాగంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న ఆచార్యులు

వెంకోజీపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ప్రాణదాతలు కావచ్చ ని ఏయూలోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు పేర్కొన్నారు. సోషల్ వర్క్ విభాగంలో సోమవారం లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ ఎ.నరసింహారావు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆపద సమయంలో మనం చేసే రక్తదానం ఎంతో మందికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుందన్నారు. సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.హరనాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక స్పృహ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోమలి సలోమి, శ్యామ్, ఆశాకిరణ్, వేసవిల, పుష్ప, లక్ష్మణరావు, శిరీషా, సూరిబాబు, అమిత, విద్యార్థులు పాల్గొన్నారు. వీరితో పాటు బ్లడ్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ సుమన, డాక్టర్ కిరణ్, లలిత, అరుణసామి, లక్ష్మణ్, లలిత, కనకమహాలక్ష్మి, జ్యోతిసాబత్, జగదీష్, సంజు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన జపాన్ బృందం


వీసీ శశిభూషణరావుతో సంభాషిస్తున్న జపాన్ ప్రతినిధులు

వెంకోజీపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని జపాన్‌లోని తోయామా యూనివర్సిటీ ప్రతినిధులు సోమవారం సందర్శించారు. తోయామా వర్సిటీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ టెక్సో హతకేయమ ఆధ్వర్యంలో నిపుణుల బృందం ఇక్కడి అధికారులతో భేటీ అయ్యింది. ముందుగా ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు జపాన్ బృందానికి ఏయూ ప్రాధాన్యతను వివరించారు. ఇక్కడ జపాన్ ఇన్ఫర్మేషన్ సెంటర్ గతంలోనే ఏర్పాటు చేశామని, ఏటా తమ విద్యార్థులు అక్కడకు వస్తున్నారని తెలిపారు.అనంతరం జపాన్ ఆచార్యుడు హతకేయమా మాట్లాడుతూ తొయామా వర్సిటీలో ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీరింగ్, ఫ్యాకల్టీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరింగ్, ఫ్యాకల్టీ ఆఫ్ నర్సింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. విద్యా సంబంధ సహకారం కోసం తాము ఏయూకి వచ్చామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ విశ్వవిద్యాలయంగా ఉన్న ఏయూతో పరిశోధన సంబంధిత అంశాలలో కలిసి పని చేయాలని అభిలషిస్తున్నట్లు తెలిపారు. రెండు వర్సిటీల మధ్య విభిన్న అంశాలలో సహకారం, తోడ్పాటు ఉండాలని ఆకాంక్షించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, అకడమిక్ డీన్ కె.ఈశ్వర్ కుమార్, ప్రిన్సిపాల్ గిరిజాశంకర్, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

6న కులశేఖర్ సంస్మరణ సభ

డాబాగార్డెన్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నగరానికి చెందిన ప్రముఖ తెలుగుగేయ రచయిత కులశేఖర్ (52) సంస్మరణ సభ ఈ నెల 6న నిర్వహించనున్నట్టు వీఎఫ్‌ఎస్ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. అనేక చిత్రాలకు గేయాలు రాసి కీర్తి పొందారన్నారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు విశాఖ పౌరగ్రంథాలయంలో సభ నిర్వహిస్తున్నామన్నారు.

ఎయిర్‌పోర్ట్ సీఐగా ఉమామహేశ్వరరావు



మ(రి)పాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ సీఐగా జి.ఉమామహేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఆయన పాయకరావుపేట, నర్సీపట్నం, కొత్తకోట తదితర ప్రాంతాల్లో ఎస్సైగా విధులు నిర్వహించి 2019లో సీఐగా పదోన్నతి పొందారు. అనకాపల్లి సీసీఎస్, పరవాడ లాఅండ్‌ఆర్డర్, స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్, శ్రీకాకుళం టూటౌన్‌లో సీఐగా విధులు నిర్వహించిన ఆయన వీఆర్ నుంచి ఎయిర్‌పోర్ట్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసి శాంతిభద్రతల పరిరక్షణకు సిబ్బంది సహకారంతో కృషి చేస్తానన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు.

6న సినీ గేయ రచయిత కులశేఖర్ సంస్మరణ సభ

డాబాగార్డెన్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నగరానికి చెందిన ప్రముఖ తెలుగుగేయ రచయిత కులశేఖర్ (52) సంస్మరణ సభ ఈ నెల 6న నిర్వహించనున్నట్టు వీఎఫ్ఎస్ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. అనేక చిత్రాలకు గేయాలు రాసి కీర్తి పొందారన్నారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు విశాఖ పౌరగ్రంథాలయంలో సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కులశేఖర్‌కు మార్గదర్శనం చేసిన మాస్టర్ వైసత్యారావు, సహ విద్యార్థి, రచయిత లోగిస లక్ష్మీనాయుడు హాజరుకానున్నారని అన్నారు. కులశేఖర్ మిత్రులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలి'



అపాస్ అధ్యక్షుడు బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపాస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ కోరారు. విశాఖ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను జిల్లా కమిటీ కలిసి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. బాలాజీ మాట్లాడుతూ మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. 12వ వేతన సంఘం కమిషనర్‌ను నియమించి సిఫార్సుల అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేసి విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. నిలిపివేసిన మున్సిపల్ పండిత ప్రమోషన్లు వెంటనే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అవనాపు అరుణ్ కుమార్, పి.త్రినాథమూర్తి, కోశాధికారి ఎంఎస్‌వీ విశ్వనాథం, నాయకులు సుదర్శన పట్నాయక్, వి.ఫణికుమార్ పాల్గొన్నారు.

మళ్లింపు మార్గంలో రైళ్లు

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 4, 6, 7, 9, 11, 13, 14 తేదీల్లో ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351)... ఈ నెల 4, 11న జసిడి హ్-తంబరం ఎక్స్‌ప్రెస్ (12376)...ఈ నెల 7, 14న హటిమా-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (18637)...ఈ నెల 6, 13న టాటానగర్-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12889)...ఈ నెల 2, 19న హటియా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (22837) రైళ్లు నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయని పేర్కొన్నారు.

లింగ ఆధారిత హింసపై మహిళలకు అవగాహన



శిక్షణ పొందిన బృందంతో నిర్వాహకులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మారిటైం, షిప్ బిల్డింగ్ అనుబంధ ఇండస్ట్రీస్‌లో మానవ వనరుల శిక్షణకు సాంకేతిక అభివృద్ధి, అకాడమిక్స్ సేవలకు అంకితమైన భారత ప్రభుత్వం స్థాపించిన సెంటర్ ఆఫ్ ఎక్సెస్ ఇన్ మారిటైం షిప్ బిల్డింగ్ (సెమ్స్)లో మహిళలకు సోమవారం లింగ ఆధారిత హింసపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్కిల్ కళాశాల మేనేజర్ ప్రజీత్ కురుప్ మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించడం హర్షణీయమన్నారు. సమాజంలో ఎదురయ్యే ఇబ్బందులను మహిళలు సమర్థంగా ఎదుర్కొని ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ముందంజ వేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న యువతులు నినాదాలు చేశారు. సెమ్స్ స్కిల్ కాలేజీ సీఈవో కె.సేతు మాధవన్, ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ కాలేజీ సమన్వయకర్త కుమారి, పి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు



సీతంపేట పార్వతీశ్వరాలయంలోని కొలనులో దీపాలు వదులుతున్న మహిళలు



డాబాగార్డెన్స్‌లో ప్రత్యేక అలంకరణలో చంద్రమౌళీశ్వరస్వామివారు



మాధవధార హరిహర క్షేత్రంలో అన్న ప్రసాద వితరణ చేస్తున్న బీజేపీ నాయకురాలు దీపిక

డాబాగార్డెన్స్/సీతంపేట/మురళీనగర్/ మాధవధార/మ(రి)పాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పోలిపాడ్యమిని మహిళలు ఉపవాస దీక్షలతో ఆచరించారు. వేకువ నుంచే ఆలయాలకు చేరుకున్న భక్తులు మందిరాల్లో ఏర్పాటు చేసిన కొలనుల్లో, సహజ సిద్ధ జలధార ప్రాంతాల్లో అరటి దవ్వల్లో వత్తులు వెలిగించి దీపారాధన చేశారు. ఆదిశంకరుడిని భక్తిప్రపత్తులతో పూజించారు. దీపదానాలు, సాలగ్రామ దానాలు ఇచ్చారు. డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయంలో అర్చకులు జి.భార్గవశర్మ శైవ ఆగమ సంప్రదాయ రీతిలో ప్రత్యేక పూజలు, ఉమాదేవి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, కే.మన్మథరెడ్డి, గోపి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. సీతంపేట పార్వతీశ్వరాలయంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు. నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించి కార్తీక దామోదరుడ్ని పూజించారు. మురళీనగర్ ఆలయంలో ఏర్పాటు చేసిన కొలనులో భక్తులకు ఆలయ కమిటీ కార్యదర్శి సనపల వరప్రసాద్ కమిటీ సభ్యులు సౌకర్యాలు కల్పించారు. హైవే రోడ్డు సత్యానగర్ శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం, బర్మాక్యాంపు శివాలయాల్లో రద్దీ కనిపించింది. మాధవధార గాంధీనగర్ హరిహర క్షేత్రం శివాలయంలో రుద్రునికి ప్రత్యేక పూజాభిషేకాలు జరిపారు. ఆలయ ఆవరణలో జరిపిన అన్నసంతర్పణ కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కుమార్తె, బీజేపీ నాయకురాలు దీపిక 51వ వార్డు కార్పొరేటరు రెయ్యి వెంకటరమణతో కలసి భక్తులకు అన్న ప్రసాదాల్ని వడ్డించారు. మ(రి)పాలెం సాయినగర్‌లోని శ్రీకాశీ విశ్వేశ్వరాలయంలో తెల్లవారుజామున పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు ఆరటిదొప్పల్లో దీపాలను వెలిగించి కొలనులో వదిలారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈఓ పీఎస్ఎన్‌మూర్తి, అర్చకులు అందుకూరి శివాజీశర్మ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్ రిఫరీగా నారాయణరావు



అథ్లెటిక్స్ రిఫరీగా అర్హత సాధించిన నారాయణరావును అభినందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ గణబాబు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అథ్లెటిక్స్ రిఫరీగా నగరానికి చెందిన ఎం.నారాయణరావు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు గణబాబు సోమవారం తన కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ రాష్ట్ర అథ్లెటిక్స్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శిగా చిత్తశుద్ధితో సేవలందిస్తున్న నారాయణరావు, అంతర్జాతీయ రిఫరీగా అర్హత సాధించడం జిల్లా క్రీడారంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. అథ్లెటిక్స్‌పై విశేష పరిజ్ఞానం కలిగిన నారాయణరావు రిఫరీగా విలువైన సేవలందించగలరని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ క్రీడాధికారి జూన్ గ్యాలియట్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు.

రైళ్లలో ఆకస్మిక తనిఖీలు

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికులకు అందించే ఆహార, పానీయాల నాణ్యత, ప్రమాణాలు, ధరల పరిశీలనపై వాల్తేరు డివిజన్ 20 మంది ప్రత్యేక సిబ్బందితో సోమవారం డ్రైవ్ చేపట్టింది. అధిక ధరలు వసూలు చేయడం, డిజటల్ చెల్లింపులకు అనుమతించకపోవడం వంటి ఫిర్యాదులపై వాణిజ్య విభాగం స్పందించింది. విశాఖ రైల్వే స్టేషన్‌లోని ఫుడ్ స్టాల్స్‌తోపాటు వివిధ రైళ్లలో ప్యాంటీకార్ కోచ్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించారు. ప్లాట్‌ఫామ్, రైళ్లలో అనధికార విక్రయదారులను ఆర్పీఎఫ్‌కు అప్పగించారు. అక్రమార్కులను కట్టడి చేస్తామని సీనియర్ డీసీఎం సందీప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో విశాఖ చిన్నారులకు పతకాలు



పతకాల సాధకులతో కోచ్ కన్నబాబు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి బాలుర బాలికల టేబుల్ టెన్నిస్ టోర్నీలో విశాఖ చిన్నారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. నంద్యాలలో జరిగిన ఈ టోర్నీ టీం ఈవెంట్‌లో బాలికల జట్టు రన్నరప్ ట్రోఫీని సాధించగా, బాలుర జట్టు తృతీయ స్థానం దక్కించుకుంది. బాలికల విభాగంలో ఎస్‌కె.ఆరిఫ్ సుల్తానా, ఎం.ధార్మిక శ్రీ, టి.శాన్విక, కె.దేవి జశ్మిత, ఎస్.జ్యోత్స్న...బాలుర విభాగంలో హార్దిక్ రామ్, సీహెచ్‌ఎంఎన్.బాలాజీ, ఎం.ఆంధ్యనాథ్ బాబు, ఎస్.హర్షిత్, వై.అభయ్ పతకాలు సాధించి జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన చిన్నారులతోపాటు కోచ్‌గా వ్యవహరించిన కన్నబాబును జిల్లా విద్యాశాఖాధికారి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి దేవుడు అభినందించారు.

ప్రణవ్‌కు అభినందన

మహారాణిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్‌ను టీడీపీ బీసీ విభాగం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బొట్టా పరదేశీ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. శాలువాతో సన్మానించారు. అధికార ప్రతినిధి గరికిన ప్రతాప్, చింతపల్లి చిన పోలరాజు, వినయ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి రీజనల్ పాలీటెక్ ఫెస్ట్



గోడప్రతిని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్స్ డా.కె.నారాయణరావు, డా.కె.వి.రమణ తదితరులు

కంచరపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో ఈ నెల 4, 5 తేదీల్లో రీజనల్ పాలీటెక్ ఫెస్ట్ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు తెలిపారు. రీజనల్ ఫెస్ట్‌కు సంబంధించిన వివరాలను సోమవారం విలేకరులకు ఆయన వివరించారు. రెండు రోజులు జరగనున్న ఫెస్ట్‌కు సంబంధించిన గోడప్రతిని డా.కె.నారాయణరావు, కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ తదితరులు ఆవిష్కరించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 8 ప్రభుత్వ, 19 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటారని వెల్లడించారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన సుమారు 200 ప్రాజెక్టులను ఇందులో ప్రదర్శిస్తారు. ఇటువంటి ఫెస్ట్‌లను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలుగులోకి తీసుకరావడమే సాంకేతిక విద్యాశాఖ లక్ష్యమన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ప్రాజెక్టులకు రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25 వేలు వంతున బహుమతులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'డెయిరీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'



ధర్నా చేస్తున్న డెయిరీ ఉద్యోగులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ కో ఆపరేటివ్ డెయిరీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట సోమవారం ఉద్యోగులు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ గత నెల 21 నుంచి నిరవధిక నిరాహార దీక్షలు విశాఖ డెయిరీ వద్ద జరుగుతున్నా యాజమాన్యం స్పందించలేదన్నారు. 30న జరిగిన జాయింట్ మీటింగ్‌కు యాజమాన్యం హాజరవ్వలేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించకపోతే సమ్మె చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. కార్మికశాఖాధికారులు స్పందించి విశాఖ కో ఆపరేటివ్ డెయిరీ కార్మికులకు తగు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్, వరహమూర్తి, ఎస్.రమణ, నారాయణ, వెంకట రమణ, అప్పారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 4న హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

ప్రదర్శించేవారమని, ఈసారి ఈ కార్యక్రమం పూరీలో ఏర్పాటుచేశామన్నారు. విశాఖ ప్రజలకు అసంతృప్తి లేకుండా జనవరి 4న ఆపరేషన్ డెమో నిర్వహిస్తామని చెప్పారు. దీనికి కూడా సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా వస్తారన్నారు. - విశాఖపట్నం విమానాశ్రయం పౌర సేవలకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని, అందుకు అవసరమైన మౌలిక వసతులన్నీ ఉన్నాయన్నారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైన తరువాత కూడా ఈ విమానాశ్రయం ఉపయోగించుకుంటామంటే తమకు ఏమీ అభ్యంతరం లేదన్నారు. - తీర ప్రాంతం (బీచ్)లో నిర్మించే అత్యంత ఎత్తైన భవనాలకు నేవీ నుంచి నిరభ్యంతర ధ్రువపత్రం (ఎన్‌ఓసీ) అవసరమన్నారు. జిల్లా అధికారులతో కూడిన కమిటీలో నిబంధనల మేరకు అవసరమైన వాటికి ఎన్‌ఓసీలు ఇస్తామన్నారు. రక్షణపరమైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టంచేశారు. విమాన వాహక నౌక (ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్) విక్రాంత్ విశాఖపట్నం కేంద్రంగానే పనిచేస్తుందని, అయితే అతి పెద్ద నౌక కావడంతో అది నేవల్ డాక్‌యార్డులోకి రాలేదని, దాని కోసం ప్రత్యేకంగా అవుటర్ హార్బర్‌లో జెట్టీ నిర్మాణం చేయాలని, దీనికి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయన్నారు.- విజయనగరం సమీపానున్న బాడంగి ఎయిర్‌స్ట్రిప్‌లో ప్రస్తుతం నేవీ కార్యక్రమాలు ఏమీ నిర్వహించడం లేదని స్పష్టంచేశారు. - విశాఖపట్నం పరిసరాల్లో మొక్కల పెంపకానికి సంబంధించి 1.4 కోట్ల విత్తన బంతులు ఏడాది కాలంలో వెదజల్లామని చెప్పారు.

నిరీక్షిస్తున్న వ్యక్తిని బెదిరించిన ముగ్గురి అరెస్టు

సీతంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి రైల్వేస్టేషన్ బస్టాప్ వద్ద గుర్తుతెలియని ముగ్గురు యువకులు ఓ వ్యక్తిని బెదిరించి అతని వద్ద నుంచి రూ.80 నగదు, బ్లూటూత్ లాక్కోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు చాకచక్యంగా వారిని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన మొహంతి రామకృష్ణ నాయుడు సోమవారం రాత్రి రైల్వేస్టేషన్ సమీపంలోని సీఎంఆర్ బస్టాప్ వద్ద నిరీక్షిస్తుండగా ముగ్గురు యువకులు బెదిరించారు. అతని వద్ద ఉన్న బట్ నెక్ బ్లూ టూత్, పర్సులోని రూ.80 డబ్బు లాక్కున్నారు. దీంతో బాధితుడు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి వచ్చిన క్రైమ్ పోలీసులు సాంకేతిక నైపుణ్యంతో ఆ ముగ్గురిని పట్టుకున్నారు. విజయవాడ వాసి జంప హరి (22), రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన జాజుల నాగరాజు (25), మధురవాడ కొమ్మాది ప్రాంతీయుడు దర్శల సంతోష్ (23)లను నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు.

పబ్‌లు,బార్‌ల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

బార్‌లలో తనిఖీలు చేశారు. నాలుగు పబ్‌లు/బార్‌లకు అసలు మద్యం విక్రయించేందుకు ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి లేదని ఈ సందర్భంగా గుర్తించారు. అలాగే మూడు పబ్‌లు, బార్‌లకు ఆహార పదార్థాలు విక్రయించేందుకు ఫుడ్ కంట్రోల్ డిపార్టుమెంట్ అనుమతి లేదని, 12 పబ్‌లు/బార్‌లకు పార్కింగ్ స్థలం లేదని, 14 పబ్‌లు/బార్‌లకు ఫైర్ డిపార్టుమెంట్ నుంచి నిరభ్యంతర ధృవీకరణ పత్రం లేదని, రెండు పబ్‌లు/బార్‌లు సీసీ కెమెరాలు ఏర్పాటుచేయలేదని, మరో మూడు పబ్‌లు/బార్‌లకు సరైన కిచెన్ లేదని, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారని గుర్తించారు. 12 బార్‌లలో ఎంఆర్‌పీకి మించి మద్యాన్ని విక్రయిస్తున్నట్టు గుర్తించారు. వారందరిపై చర్యలకు సంబంధిత శాఖలకు నివేదికలు పంపిస్తామని సీపీ తెలిపారు.

7న ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం

» ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ గ్రూపు ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ హాజరు



పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, డాక్టర్ ఇ.శంకరరావు, డాక్టర్ కుమార్‌రాజా, ఎ.చంద్రశేఖర్, ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు, ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనాన్ని ఈ నెల ఏడో తేదీన నిర్వహిస్తున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు తెలిపారు. సోమవారం ఉదయం అలూమ్ని అసోసియేషన్ జీఎంఆర్ స్మార్ట్ సెమినార్ హాలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడో తేదీ నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ గ్రూపు ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్, ప్రత్యేక అతిథిగా పద్మశ్రీ డాక్టర్ ఎస్‌వీ ఆదినారాయణ, విశిష్ట అతిథిగా రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారన్నారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, ఎంపీ ఎం.శ్రీభరత్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు. ఇప్పటివరకూ దేశ,విదేశాలకు చెందిన సుమారు 1500 మంది పూర్వ విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని వెల్లడించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఛైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు మాట్లాడుతూ బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అతిథులు ఉదయం వర్సిటీలోని కాలేజీలను సందర్శిస్తారన్నారు. పూర్వ విద్యార్థులు కూడా ఉదయం నుంచే తాము చదివిన విభాగాలకు వెళ్లి గత స్మృతులను నెమరువేసుకుంటారని వెల్లడించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ కుమార్‌రాజా, కార్యదర్శి ఎ.చంద్రశేఖర్, రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

అభిప్రాయపడుతూ, వీటిని గుర్తించేందుకు కూంబింగ్ పార్టీలు యత్నిస్తున్నాయన్నారు.

ఏజెన్సీ నుంచి గంజాయి రవాణాను అరికట్టేందుకు అనేక రకాల చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటివరకూ ఉన్న 13 చెక్‌పోస్టులకు అదనంగా 23 చెక్‌పోస్టులు ఏర్పాటుచేశామని డీఐజీ గోపీనాథ్ వెల్లడించారు. ఒక్కొక్క చెక్‌పోస్టులో మూడు షిఫ్టులలో నలుగురేసి సిబ్బంది విధులు నిర్వహిస్తారని వివరించారు. 11 చెక్‌పోస్టుల వద్ద డాగ్ స్క్వాడ్‌లు ఏర్పాటుచేశామన్నారు. వీటికితోడు 350 మొబైల్ చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయన్నారు. చెక్‌పోస్టుల ద్వారా 166 కేసులు నమోదుచేసి, 476 మందిని అరెస్టు చేసి వారి నుంచి 12 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి రవాణాలో నిందితులుగా ఉంటూ తప్పించుకు తిరుగుతున్న 729 మందిని అరెస్టు చేశామన్నారు. పలు రాష్ట్రాలకు చెందిన సుమారు 120 గ్యాంగ్‌లను గుర్తించామని, వీరిలో పలువురిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు.

గంజాయి రవాణాకు సంబంధించి 25 కేసుల్లో నిందితులకు 10 నుంచి 25 సంవత్సరాల జైలు శిక్ష పడిందని, భవిష్యత్తులో మరిన్ని కేసుల్లో శిక్షలు పడేలా చార్జిషీట్లు పక్కాగా రూపొందిస్తున్నామని డీఐజీ గోపీనాథ్ చెప్పారు. అదేపనిగా గంజాయి వ్యవహారాలతో సంబంధం ఉన్న 21 మందిపై పీడీ యాక్టు అమలు చేస్తున్నామని వెల్లడించారు. మరో 247 మంది అనుమానితులపై గంజాయి కేసులు (గంజాయి షీట్స్) నమోదుచేయగా, మరొకరిపై రౌడీషీట్ ఓపెన్ చేశామన్నారు. గంజాయితో దొరికే వ్యక్తుల వాహనాలు, ఆస్తులు సీజ్ చేయాలని నిర్ణయించామన్నారు. ఏజెన్సీలో గతంలో పండించిన గంజాయి భారీగా నిల్వ ఉందని అనుమానం వ్యక్తంచేశారు.

ఏజెన్సీలో పలు గ్రామాలతోపాటు నర్సీపట్నం నుంచి మాడుగుల వరకూ, అనకాపల్లి, విశాఖ నగర శివారుల్లో కొంతమంది వద్ద నిల్వలు ఉన్నాయని త్వరలో దాడులు చేస్తామని వెల్లడించారు. గంజాయి వినియోగంపై సంకల్పం పేరుతో ప్రారంభించిన కార్యక్రమానికి మంచి స్పందన లభించిందన్నారు. రెండు లక్షల మంది విద్యార్థులను, వేలాది మంది ఉద్యోగులను చైతన్యవంతులను చేశామన్నారు. గంజాయి అమ్మకాలు, వినియోగంపై సమాచారం అందించేందుకు 150 చోట్ల బాక్సులు ఏర్పాటుచేశామన్నారు. గంజాయికి దూరంగా ఉండేందుకు 'యుద్ధం' పేరుతో కొత్త కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. ఏజెన్సీ సందర్శనకు వచ్చే పర్యాటకులు గంజాయి రవాణా, వినియోగానికి దూరంగా ఉండాలని డీఐజీ పిలుపునిచ్చారు. పర్యాటక ప్రాంతాల్లోని హోటళ్లు, రిసార్టులలో గంజాయికి వ్యతిరేకంగా పోస్టర్లు అతికించామన్నారు.

ఉక్కు సీఎండీపై ఊగిసలాట

... 5వ పేజీ తరువాయి

శక్తిమణిని ఆర్ఐఎన్ఎల్ సీఎండీగా ఎంపిక చేశారు. ఈ విషయాన్ని సెప్టెంబరు మూడో తేదీన ప్రకటించారు. అతుల్‌భట్‌ను సెలవుపై పంపినప్పుడు శక్తిమణికి అవకాశం ఇవ్వాలి. కానీ అలా చేయకుండా ప్రాజెక్టు డైరెక్టర్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఇరవై రోజులు కాగానే ఆయన్ను కూడా తప్పించారు. సెప్టెంబరు 30న మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఓఐఎల్) సీఎండీ అజిత్‌కుమార్ సక్సేనాను తీసుకువచ్చి సీఎండీ సీట్లో కూర్చోబెట్టారు. ఆదివారం రోజున ఆయన నియామకపు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు కొనసాగాలని సూచించారు. నిబంధనల ప్రకారం చూస్తే అధికారిక సీఎండీ అతుల్‌భట్ నవంబరు 30వ తేదీన పదవీ విరమణ చేసినందున కమిటీ ఎంపిక చేసిన శక్తిమణికి అవకాశం ఇవ్వాలి. కానీ ఆయనకు ఇంకా ఆదేశాలు ఇవ్వలేదు. ఇంకొన్నాళ్లు సక్సేనానే కొనసాగించాలని నిర్ణయించినట్టు సమాచారం. సక్సేనా బాధ్యతలు చేపట్టాక బ్యాంకుల్లో నిధులు ఉన్నా ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదు. సెప్టెంబరు జీతం 50 శాతం, అక్టోబరు నెల 35 శాతం జీతం బకాయిలు పెట్టారు. నవంబరు నెల జీతాలకు సంబంధించి 9వ తేదీ వరకు ఎటువంటి ప్రతిపాదనలు తయారు చేయవద్దని ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది. అంటే పదో తేదీ వరకూ జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. జీతాల కోసం ఉద్యోగులు ఫైనాన్స్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తే వారందరిని గుర్తించి నోటీసులు జారీచేశారు. మరోసారి ధర్నాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాంతో ఉద్యోగుల కుటుంబ సభ్యులను రోడ్లపైకి వచ్చి జీతాల కోసం ఆందోళన చేస్తున్నారు. ఏం చేసినా వారికి సకాలంలో జీతాలు ఇవ్వడానికి సీఎండీ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఇక్కడి పరిస్థితిని విశాఖ ఎంపీ శ్రీభరత్ స్వయంగా కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి దృష్టికి తీసుకువెళ్లినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోవడం గమనార్హం.

ఆర్‌ఈసీఎస్‌పై నేతల కన్ను

... 5వ పేజీ తరువాయి

వసూళ్లు, ఖర్చులు, లాభం చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. అవే వనరులు, అదే ఉద్యోగులతో ఈపీడీసీఎల్ ఆర్‌ఈసీఎస్‌ను నడుపుతోంది. 2023 జనవరి నుంచి డిసెంబరు నెలాఖరు వరకు రూ.161.52 కోట్లు బిల్లుల రూపంలో వసూలైంది. అంటే నెలకు రూ.12 కోట్లపైనే వచ్చింది. ఆ ఏడాది వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.4.46 కోట్లు చెల్లించింది. ఉద్యోగులకు జీతాలు, చిల్లర ఖర్చులకు రూ.29.37 కోట్లు అయ్యాయి. దీంతో రూ.127.68 కోట్లు మిగిలింది. గతంలో ఆర్‌ఈసీఎస్‌కు ఈపీడీసీఎల్ సరఫరా చేసిన విద్యుత్‌కు యూనిట్‌కు రూ.1.40 మాత్రమే వసూలు చేసేది. 2023లో ఆర్‌ఈసీఎస్‌కు సుమారు 30 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. దానికి ఆ రేటు ప్రకారం చూసుకుంటే రూ.42 కోట్ల వరకు బిల్లింగ్ చేయాల్సి ఉంటుంది. ఆ మొత్తం కూడా మినహాయిస్తే నికరంగా 2023లో రూ.85.68 కోట్లు మిగిలినట్టు. అవే ఏర్పాట్లు, అదే సిబ్బంది, అదే బిల్లింగ్...లెక్కలు మాత్రం వేరు. నాడు రెస్కో చూపించిన ఖర్చులు వేరు. ఇప్పుడు అయిన ఖర్చులు వేరు. అదే తేడా. అనకాపల్లి నేతలు అసెంబ్లీలో రెండేళ్ల లాభం లెక్కలు చూపించారు. ఒక్క ఏడాది కూడా రూ.2 కోట్లు లేదు. కానీ ఈపీడీసీఎల్ నుంచి సమాచార హక్కు చట్టం కింద సేకరించిన వివరాల ప్రకారం ఒక్క 2023లోనే రూ.85.68 కోట్లు మిగిలాయి.

రాయితీ మొత్తం ఈపీడీసీఎల్ నుంచి యూనిట్ రూ.1.40 చొప్పున తీసుకుని సగటున రూ.5 చొప్పున అమ్ముకుంటున్నారు. అంటే యూనిట్‌కు రూ.3.60 మిగులుతోంది. సొసైటీ కాబట్టి దీనిని సభ్యులకు డివిడెండ్ రూపంలో పంచాలి. కానీ రూ.2 కోట్ల కంటే తక్కువ లాభం చూపించి, మిగిలిన మొత్తం అంతా రకరకాల ఖర్చుల పేర్లతో సొసైటీ అధికారులు, ఆ ప్రాంత నాయకులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్‌ఈసీఎస్ చేజారిపోకుండా గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు చేయని ప్రయత్నం లేదు. ప్రభుత్వం నుంచి సిఫారసు లేఖ ఇప్పించారు. కొంతమంది వద్ద రూ.లక్షలు తీసుకుని ఉద్యోగులుగా నియమించారనే ఆరోపణలు కూడా వచ్చాయి. అధికారంలో ఎవరు ఉన్నా ఆర్‌ఈసీఎస్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి ఈపీడీసీఎల్ నుంచి వెనక్కి తీసుకుని లైసెన్స్ ఇప్పించాలని కొందరు కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. దీనికి ఉత్తరాంధ్రకు చెందిన ఒక కీలక నేత సహకారం అందిస్తున్నట్టు చెబుతున్నారు.

తహసీల్దార్లకు వినతులు

సీతమ్మధార/మురళీనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి); సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.రమేష్ అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి ధ్రువపత్రాలను వెంటనే మంజూరు చేస్తామన్నారు. 51వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు జి.అప్పారావు అర్బన్ తహసీల్దారు కార్యాలయం-3 (గోపాలపట్నం)లో వినతిపత్రం అందించారు. ఆదాయ, కుల ధ్రువీకరణలను వీలైనంత వేగంగా దరఖాస్తుదారులకు అందించాలని కోరుతూ తహసీల్దారు రమేష్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు శ్రీను, మన్మధ, కనకరాజు ఉన్నారు.


గోతులు పూడ్చుతున్న యువకులు

రోడ్లపై గోతులు పూడ్చివేత

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 2: జీవీఎంసీ 77వ వార్డులోని పలు ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పడిన గోతులను చినపాలెం యూత్ అసోసియేషన్ సభ్యులు పూడ్చివేశారు. రోడ్లపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులకు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో తాము గోతులను పూడ్చి వేశామని పలువురు యువకులు తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

పెదగంట్యాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డు పరిధి సీతానగరం ఎస్సీ కాలనీ, దుర్గవానిపాలెంలో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదును చేపట్టారు. టీడీపీ మండల ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దాడ సోమునాయుడు, తదితరులు ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదులు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గంట్యాడ పోలయ్య, టేకేటి అప్పారావు, ఉరుకూటి అప్పలరాజు, పి.అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 24 వినతులు

గాజువాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 24 వినతులు వచ్చాయి. వీధి లైట్లు వెలిగేలా చూడాలని, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని, గోతులమయమైన వీధి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలువురు వినతిపత్రాలను అందజేశారు. ఆయా సమస్యలను పరిష్కరిం చేందుకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు జెడ్సీ శేషాద్రి ఆదేశించారు.

వేపగుంటలో నాలుగు..

వేపగుంట: స్థానిక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు నాలుగు వినతులు అందాయి. దుర్గానగర్ విద్యానికేతన్ స్కూల్ ఎదురుగా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని, కాలనీలో రహదారులు, కాలువల నిర్మాణం చేపట్టాలని, సుజాతానగర్ శివారులో యుజీడీ పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరారు. జెడ్సీ కె.హైమావతి వినతులు స్వీకరించారు.

నేడు కొత్తపాలెంలో ప్రజా దర్బార్

గోపాలపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జీవీఎంఊఎస 89వ వార్డు పరిధి కొత్తపాలెంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రారంభమవుతుందని టీడీపీ వార్డు అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్ తెలిపారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు హాజరు కానున్నారని, ప్రజా సమస్యలపై వినతులు స్వీకరిస్తారన్నారు.

సినిమా గైడ్

● **మెకానిక్ రాఖీ :** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● **దేవకీనందన వాసుదేవ :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **జీబ్రా :** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)

● **కంగువా :** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **లక్కీ భాస్కర్:** వెంకటేశ్వర

● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 46, వంకాయలు(తెలుపు) 34, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 32, క్యారెట్ 60 దొండకాయలు32, బంగాళదుంపలు 36, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 28 దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ 60, పొటల్స్ 50, కీరదోస 28, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44,చిలగడదుంపలు 38, కంద58, దేముడుచిక్కుడు 64, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్దకట్ట)35, పుదీన(కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిదగుమ్మడి కాయ30, క్రర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	605
విజయనగరం	609
శ్రీకాకుళం	609

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210


కణితి ఉమామార్కండేశ్వరాలయంలో దీపారాధనలో పాల్గొన్న భక్తులు..పార్వతీదేవి అలంకరణలో శివలింగం


నాతయ్యపాలెం చెరువులో కార్తీక దీపాలు వదులుతున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి పూజలు

కూర్మన్నపాలెం/ఆటోనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసానికి వీడ్కోలు చెబుతూ పోలి పాడ్యమి పూజలను సోమవారం పలు ప్రాంతాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక దామోదర మోక్ష దామోదర, వైకుంఠ దామోదర.. అంటూ మహిళలు నదులు, ఆలయాల వద్దనున్న కోనేరులు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీళ్ల కుండీలలో కార్తీక దీపాలను వెలిగించారు. వైష్ణవ, శివాలయాలతో పాటు రావి, వేప, జమ్మి, తులసి, మర్రిచెట్ల వద్ద భక్తులు పూజలు చేశారు. 86వ వార్డు మాతృశ్రీ నగర్‌లోని కాశీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీవిశ్వేశ్వరాల యంలో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతిల ఆధ్వర్యంలో శివలింగానికి పంచామృతాభిషేకాలు చేయడంతో పాటు ఆలయ ఆవరణలో హోమాలు జరిపారు. 87వ వార్డు కణితి పద్మశాలీ వీధిలో శ్రీఉమామార్కండేశ్వరస్వామి ఆలయంలో పరమశివునికి పంచామృతాభిషేకాలు, హోమాలు జరిపారు. స్వామివారిని చందనంతో పార్వతీదేవిగా అలంకరించారు. వడ్లపూడి శ్రీసీతారామలింగేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మసూత్ర శివలింగం వద్ద సామూహిక పూజలు, దీపారాధనలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, ఆలయ కమిటీ ప్రతినిధులు తాత నాయుడు, గోవింద్, రాము, కృష్ణ, గోవిందరాజులు స్వామివారిని దర్శించుకున్నారు. 71వ వార్డు శ్రీనగర్ శ్రీకృష్ణాలయం వద్ద ఏర్పాటు చేసిన కోనేటిలో భక్తులు కార్తీక దీపాలు వదిలారు. అదేవిధంగా జీవీఎంసీ 70 వార్డు ఆటోనగర్ శివాలయంలో స్ఫటిక శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు, బిల్వపత్రాలతో అర్చన, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. చట్టివానిపాలెంలోని శ్రీబాలాత్రిపురసుందరి అమృతలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. వడ్లపూడి, కణితి, సంతమామిడి తోట శివాలయాల్లో వేకువజామునే దీపారాధన చేశారు. కూర్మన్నపాలెం సంపత్ వినాయక ఆలయం, రాజీవ్ నగర్ 18 అడుగుల ఏకశిల శివలింగం వద్ద సహస్ర దీపాలతో శివలింగాకరంలో దీపారాధనలు చేశారు. కూర్మన్నపాలెం కుంచుమాంబ ఆలయం, సంత మామిడితోట శివాలయంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రీన్‌సిటీ శ్రీశారి ఆలయంలో విశేష పూజలు జరిపారు. అర్చకులకు దీప, గోవు, సాలగ్రామ దానాలను భక్తులు సమర్పించారు.


శ్రీహరిపురంలో దీపాలు వదులుతున్న భక్తులు


అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

అక్కిరెడ్డిపాలెం: పోలి పాడ్యమిని పురస్కరించుకుని తుంగ్లాం, నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం చెరువులు భక్తులతో సందడిగా మారాయి. స్థానిక నాయకులు తుంగ్లాం, నాతయ్యపాలెం కృష్ణమహంతి చెరువుల వద్ద విద్యుత్ దీపాలను అమర్చడంతో సోమవారం వేకువజామునే అధిక సంఖ్యలో మహిళలు పెద్దసంఖ్యలో చేరుకుని పూజాది కార్యక్రమాలు నిర్వహించి అరటి డొప్పల్లో దీపాలు వెలిగించి ఆయా చెరువుల్లో విడిచిపెట్టారు. తుంగ్లాం, నాతయ్యపాలెం కృష్ణమహంతి చెరువులతో పాటు అక్కిరెడ్డిపాలెం మల్లమ్మ పేరంటాల చెరువు కార్తీక దీపాలతో కాంతులీనాయి.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం పోలిపాడ్యమిని ఘనంగా నిర్వహించారు. శ్రీహరిపురం బాబా ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపాలు వదలడానికి కొలను రూపొందించారు. గంగా, గోదావరి, కృష్ణ నదుల నుంచి జలాలను తీసుకొచ్చి కొలనులో పోశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పూజలు చేసి దీపాలు వదిలారు. శివాలయాల్లోనూ కొలనులు రూపొందించారు.

వేపగుంట/ ఎన్ఏడీ జంక్షన్: జీవీఎంసీ 93, 94వ వార్డు శివాలయాల్లో పోలిపాడ్యమి పూజలు ఘనంగా నిర్వహించారు. పల్లినారయణపురం కాశీవిశ్వేశ్వర ఆయలం, కృష్ణానగర్ దుర్గామల్లేశ్వరాలయం, రవినగర్ ఉమాశంకర్ ఆలయం, వేపగుంట శివాలయం, ప్రహ్లాదపురం శివాలయంలో పూజలు చేసి దీపాలు వెలిగించారు. ఎన్ఏడీ గణేష్‌నగర్ ప్రమాద ఉమా విశ్వేశ్వర కుమార్ స్వామి, లక్ష్మీనగర్ ఉమాశంకర గణపతి, సీతారామరాజునగర్ పార్వతీ చంద్రమౌళీశ్వరాలయం, కాకానీనగర్ శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

పెందుర్తి: పోలిపాడ్యమి సందర్భంగా సోమవారం శివాలయాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పూజలు చేశారు. చినముషిడివాడ, శ్రమశక్తినగర్ ఆలయాల్లో అన్న సమారాధనను ప్రారంభించారు. కార్పొరేటర్ వసంత శంకరరావు, సోమశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

వందడుగుల రోడ్డులో ఇష్టారాజ్యంగా పార్కింగ్

భారీ వాహనాలను సైతం నిలిపి వేస్తుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ఇతర వాహనదారులు

పట్టించుకోని అధికారులు, పోలీసులు


జోనల్ కార్యాలయం ముందు రోడ్డులో నిలిపిన వాహనాలు

గాజువాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గాజువాక వంద అడుగుల రోడ్డు పార్కింగ్ ప్రదేశంగా మారుతుంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డులో భారీ వాహనాలను సైతం ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండడం వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఇతర వాహనదారులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గాజువాక పోలీస్ స్టేషన్ కూడలి నుంచి జగ్గు జంక్షన్ వరకు గల డబుల్ రోడ్డులో రెండు వైపులా పలువురు ఇష్టానుసారంగా భారీ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఈ రోడ్డుకు ఇటీవలే మరమ్మతులు చేపట్టారు. వాహనాలు పార్కింగ్ చేయరాదంటూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ మార్గంలోనే విద్యుత్ సబ్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, జోనల్ కార్యాలయం, ప్రభుత్వ ఆస్పత్రి, కోర్టు, వంటివి ఉన్నాయి. ఆయా చోట్లకు వివిధ ప్రాంతాల ప్రజలు వచ్చి వెళుతుంటారు.

అంతేకాకుండా చుట్టుపక్కల ప్రాంతాల వారికి కూడా ఇదే ప్రధాన రహదారి. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, పెదగంట్యాడ, ఆటోనగర్ ప్రాంతాలకు భారీ వాహనాలు సైతం ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఈ రహదారికి ఇరుపక్కలా వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ మార్గంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల అధికారులు గానీ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డులోనే ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నా పోలీసులు కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి ఇరుపక్కలా భారీ వాహనాలను పార్కింగ్ చేయకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

పెందుర్తిలో మరో రైతుబజార్

» సుజాతనగర్‌లో ఏర్పాటుకు సన్నాహాలు

పెందుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో మరో రైతుబజార్ ఏర్పాటు కానుంది. సుజాతనగర్‌లో దీనిని ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పెందుర్తి ప్రాంతంలో మరో రైతుబజారు ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. ప్రస్తుత రైతుబజార్ విస్తరణ చేపట్టకపోవడంతో క్రయ, విక్రయదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పెందుర్తి రైతుబజార్‌కు ప్రతిరోజు సుమారు మూడు వేల మంది కొనుగోలుదారులు వస్తారు. 90 స్టాల్స్‌లో 250 క్వింటాళ్ల కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. 11 మండలాల్లో 51 గ్రామాలకు చెందిన 143 మంది రైతులు స్టాల్స్‌లో విక్రయిస్తున్నారు. అయితే విస్తరణ జరగకపోవడంతో రెండో రైతుబజార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇందులో భాగంగా సుజాతనగర్‌లో రూ.కోటి వ్యయంతో శీతలీకరణ రైతుబజార్ ఏర్పాటుచేయాలని అధికారులు నిర్ణయించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థలాన్ని ఎంపిక చేశారు. అయితే అక్కడ ఓ స్థిరాస్తి వ్యాపారి స్టాక్‌పాయింట్ ఏర్పాటు చేయడం, వివాదాలు తలెత్తడంతో అప్పటి ఆర్డీవో తేజ్‌భరత్ పరిశీలించారు. ఈ క్రమంలో స్థలం ఆక్రమణకు గరయింది. తాజాగా రైతుబజార్ ఏర్పాటుకు అడుగులు పడుతుండడంతో ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


పెందుర్తిలోని రైతుబజార్

ఎన్ఎస్‌టీఎల్‌లో స్వచ్ఛతా పక్వాడా


స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ అధికారులు, సిబ్బంది

గోపాలపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ పిలుపునిచ్చారు. సోమవారం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ దేశాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే ప్రధాని ఆకాంక్షను ఆచరణలో పెట్టడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఉద్యోగి తాము పనిచేసే కార్యాలయాలు, ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏడాదిలో 100 గంటలు స్వచ్ఛత కార్యక్రమాలు చేపడతామని ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ఎస్ దాస్, డివిజన్ హెడ్ రాహుల్ దీక్షిత్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారాయణం భక్తులకు అభినందనలు

అగనంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి షిర్డీ సాయి ఆలయంలో కార్తీక మాసంలో పారాయణం చేసిన మహిళా భక్తులకు పోలి పాడ్యమిని పురస్కరించుకుని సోమవారం సేవా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. తొలుత సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు వ్యాసశర్మ, శంభుడు, రామారావు, గోవిందరావు, అరుణ, సత్యలక్ష్మి, లీలావతి, కన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెలలో 74 మంది ఉక్కు ఉద్యోగుల పదవీ విరమణ

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 1: (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఈ నెలలో 74 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నారు. గత నెలలో 65 మంది పదవీ విరమణ చేసిన సంగతి తెలిసిందే. నెలనెలా పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్నా కొత్తగా ఎలాంటి నియామకాలు చేపట్టకపోవడం దారుణమని కార్మిక సంఘ నాయకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉక్కు ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగ నియామకాలకు తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కార్మికుల సస్పెన్షన్ రద్దు చేయాలని నిరాహార దీక్షలు



ఎన్ఏడీ గేటు ఎదుట నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులు

ఎన్ఏడీజంక్షన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సస్పెన్షన్ రద్దు చేయాలని ఎన్ఏడీ కార్యాలయం ఎదుట ఎన్ఏడీసీఈ యూనియన్ నాయకులు సోమవారం నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐడీఈఎఫ్ అఖిలభారత కార్యవర్గ సభ్యుడు పి.గోపాలకృష్ణ మాట్లాడుతూ ఎన్ఏడీ సీఈ యూనియన్ కార్మికులు ఆరుగురిపై పోలీసు కేసు పెట్టి, 36మంది కార్మికులను సస్పెండ్ చేయడం దేశ చరిత్రలో ఎన్నడూ జరగలేదన్నారు. సీజీఎం నిరంకుశ చర్యలను ఖండిస్తున్నామని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తామన్నారు. కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ రెడ్డి వెంకట్రావు మాట్లాడుతూ ఎన్ఏడీలో 600 మంది ఉద్యోగులకు 30 వేల స్టోరేజీ గంటల ఓటీ ఇవ్వకపోవడంతో నవంబరులో రూ.60 లక్షలు నష్టపోయారన్నారు. సీజీఎం నిరంకుశ, మొండి వైఖరిని వీడనాడకపోతే రక్షణ రంగంలోని అన్ని యూనియన్లను ఒకేవేదికపైకి తీసుకువచ్చి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.శ్రీనివాస్, పి.నూకరాజు, కార్మికులు పాల్గొన్నారు.

రీసెర్చ్‌పై విజ్ఞాన్ విద్యార్థులకు అవగాహన

అగనంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ, ఈసీఎం బ్రాంచిల విద్యార్థులకు సోమవారం రీసెర్చ్, మైక్రోవేవ్, ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ అనే అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అసోసియేట్ ప్రొఫెసర్లు పి.సాంబయ్య, జీవీఎస్ సత్యనారాయణలు ముఖ్యఅతిథిలుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైక్రోవేవ్ రంగంలో ప్రస్తుతం సాంకేతికతలు, పరిశోధనల ప్రాధాన్యం గురించి ప్రేరణాత్మకంగా వివరించారు. ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ రంగంలో తాజా అభివృద్ధి, అవకాశాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు,కో-ఆర్డినేటర్ రవికుమార్, డీన్ రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతిని సత్కరించిన క్యూఏటీడీ ఉద్యోగులు

స్టీల్‌ప్లాంట్ ప్రగతికి మరింత శ్రమించాలి

సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతి

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 2: స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్)గా రంజన్ మహంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీజీఎంగా వ్యవహరించిన శ్రీధర్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో మహంతిని ఉక్కు యాజమాన్యం నియమించింది. ఈ సందర్భంగా క్యూఏటీడీ విభాగం ఉద్యోగులు రంజన్ మహంతిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రగతి కోసం ప్రతిఒక్కరూ మరింతగా శ్రమించాలని, ప్లాంట్ ప్రొడక్షన్ 15 వేల హాట్ మెటల్‌గా ఉందని, వంద వరకు హీట్లు వస్తున్నాయని, దీనిని మరింత అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విభాగం ఉద్యోగులు జె.నరేశ్‌కుమార్, టీవీ చంద్రశేఖర్, ఎం.వెంకటేశ్వరరావు, ఎస్.చంద్రశేఖరరావు, మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఆస్పత్రి హెచ్‌వోడీగా డాక్టర్ సారంగి



ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 2: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి హెచ్‌వోడీగా డాక్టర్ జేఏన్ సారంగి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. అలాగే వైద్య సేవలను మరింత విస్తృతం చేసేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతానన్నారు. అనంతరం ఆయనకు వైద్యులు, సిబ్బంది, కార్మికులు అభినందనలు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక

రోజువారీ పరీక్షలు, అదనపు తరగతులు

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదోతరగతి పరీక్షలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సిద్ధంచేయడానికి పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ ఖరారుచేసింది. డిసెంబరు ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 10 వరకు ఏ రోజు ఏమి బోధన చేయాలి, విద్యార్థులను ఎలా సన్నద్ధం చేయాలి? చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సందేహాలు నివృత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన 100 రోజుల ప్రణాళికను జిల్లా విద్యాశాఖకు పంపింది. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థి ఎలా చదువుతున్నాడు? వెనుకబడి ఉన్నాడా? అన్నది టీచర్లు గుర్తించాలి. అవసరమైతే అదనపు తరగతులు నిర్వహించాలని, ప్రతిరోజూ పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. ఆదివారం కూడా తరగతులు నిర్వహించాలని, బాలికల విషయం జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి విద్యార్థి సమాచారం తల్లిదండ్రులకు అందించాలని పేర్కొన్నారు.

భూ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

వేపగుంట డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేపగుంట వుడా భూముల సమస్య పరిస్కరించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును సోమవారం వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు వినతి పత్రం అందజేశారు. దశాబ్దంగా సాగుతున్న సమస్యరె నివాసితులకు మేలు జరిగేలా పరిష్కరించాలని కోరారు. దీనిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట సేనాతి దేముడు, సూరిబాబు, రమేష్, మామిడి కిరణ్, నరసింగరావు ఉన్నారు.

విద్యార్థులకు మొక్కలు పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మల్కాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బౌద్ధారామం ఆధ్వర్యంలో సోమవారం మొక్కలను పంపిణీ చేశారు. హెచ్ఎం అరుణకుమారి, బౌద్ధులు బాంతిజీ మాట్లాడారు. ప్రతి విద్యార్థీ బుద్ధుని సూక్తులను పాటించాలన్నారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, శ్యామ్ సుందర్, లాలావతి, నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

మల్కాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబానికి దూరమై అనాథగా మిగిలిన ఓ వృద్ధుడు సోమవారం మృతిచెందాడు. మృతదేహానికి స్థానికులు అంత్యక్రియలు నిర్వహించారు. గాలి కామరాజురెడ్డి (90) కుటుంబానికి దూరమై కొన్నేళ్ల కిందట శ్రీహరిపురం వచ్చాడు. వయసు పైబడడంతో స్థానిక వ్యాపారులు అతడికి అండగా నిలిచారు. కాగా సోమవారం అతడు మృతిచెందడంతో జీవీఎంసీ సిబ్బంది శ్మశానవాటికకు తరలించేందుకు ఏర్పాట్లు చేయగా, వారించి వ్యాపారులే దగ్గరుండి మల్కాపురం శ్మశానవాటికలో హిందూ సంప్రదాయం మేరకు అంత్యక్రియలు నిర్వహించారు.

ఉల్లాసంగా గడిపిన పూర్వ విద్యార్థులు



తీపి గురుతుగా పాఠశాల వద్ద దిగిన గ్రూప్ ఫొటో

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సుమారు 35 ఏళ్ల తర్వాత అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌కు చెందిన 1989వ బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు కలుసుకుని సోమవారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. వీరి అ'పూర్వ' కలయికకు వారు చదువుకున్న పాఠశాల ప్రాంగణమే వేదికగా మారింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు, కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకుని సాయంత్రం వరకు ఆటపాటలతో ఎంజాయ్ చేశారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు తమ గురువులను ఘనంగా సత్కరించారు. ఇదే బ్యాచ్‌కు చెంది, ఇటీవల ఇండియా క్రికెట్ జట్టుకు ఎంపికైన కాకి నితీశ్‌కుమార్‌రెడ్డి తండ్రి ముత్యాలరెడ్డిని సన్మానించి నితీశ్ సాధిస్తున్న విజయాలను కొనియాడారు. ఈ కార్యక్రమం ఏర్పాటుకు కృషి చేసిన సంగ్రాన నూకరాజు, వాసు, ముత్యాలరెడ్డి, తదితరులను అభినందించారు.

వైభవంగా అంబలం పూజ

ఆటోనగర్,డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్వామియే అయ్యప్ప.. శరణం శరణం అయ్యప్ప మాలధారులు భక్తిపారవశ్యంలో మునిగతేలారు. 88వ వార్డు వెదుళ్ల నరవలో గురుస్వాములు పాల రమణ, రాజాన పైడిరాజు, చొప్పా అప్పలనాయుడుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అంబలం పూజను వైభవంగా నిర్వహించారు. అరటి డొప్పలతో అంబలం నిర్మించి, 18 సోపానాలను ఏర్పాటు చేసి వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పద్దెనిమిదిసార్లు మాలధారణ చేసి శబరిమల యాత్ర చేసిన గురుస్వాములను సత్కరించారు. భక్తులు ఆలపించిన భజన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

విభిన్న ప్రతిభ!



వైకల్యం వేధిస్తున్నా సత్తా చాటుతున్న దివ్యాంగులు

- చదువు, ఆట పాటల్లో మెరుగైన నైపుణ్యం
- ఆదుకుంటున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పరికరాలు
- సామాజిక బాధ్యతగా చేయూతనివ్వడమే ప్రధానం
- వివక్షతో కుంగిపోతున్న వారికి ధైర్యం కల్పించాలి
- నేడు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైకల్యం శరీరానికే తప్ప మనసుకు, ప్రతిభకు కాదన్న విషయాన్ని నిరూపించి చూపిస్తున్నారు ఎంతోమంది విభిన్న ప్రతిభావంతులు. కాసింత సహకారం అందిస్తే సత్తా చాటేందుకు ఎందరో దివ్యాంగులు సిద్ధంగా ఉన్నారు. పుట్టుకతో, ఇతర కారణాలతో వైకల్యాన్ని పొందిన వారికి అండగా నిలిచి, ప్రోత్సహించాల్సిన చోట చాలామంది వివక్షతో మరింత కుంగిపోయేలా చేస్తున్నారు. దీంతో తమలోని ప్రతిభ, ఎదిగే సామర్థ్యం ఉన్నప్పటికీ దీనమైన జీవితాలను వెళ్లదీస్తున్నారు. దివ్యాంగులకు ఆశలు, కోరికలు, లక్ష్యాలు ఉంటాయని, వారిలోని ఆలోచనలను, ఆకాంక్షలను గుర్తించి ప్రోత్సహించి సహకరించాలని నిపుణులు చెబుతున్నారు. దివ్యాంగుల ఇబ్బందులు, సమాజం అందించాల్సిన సహకారంపై అవగాహన కల్పించేందుకు ఏటా డిసెంబరు మూడో తేదీన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సమగ్రమైన, స్థిరమైన భవిష్యత్తు కోసం దివ్యాంగులు (వికలాంగులు) నాయకత్వాన్ని పెంచాలనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

సాధారణంగా నాలుగు కేటగిరీలకు చెందిన వారిని దివ్యాంగులుగా పిలుస్తారు. చూపు, ఎముకలు, వినికిడి, మానసిక



సంబంధిత సమస్యలతో బాధపడే వారిని దివ్యాంగులుగా గుర్తిస్తారు. కొందరిలో ఎక్కువ వైకల్యాలు ఉండవచ్చు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 2011 లెక్కల ప్రకారం 1,32,586 మంది దివ్యాంగులున్నారు. విభజిత జిల్లాలో 18 ఏళ్లు దాటిన విభిన్న ప్రతిభావంతులు 31 వేల మంది ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వం నుంచి చేయూత..

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందుతున్నాయి. వివిధ రకాల పెన్షన్లు అంది స్తూ వీరికి అండగా నిలుస్తుండగా, వారికి అవసరమైన పరికరాలను ఉచితంగా అందించి ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ కూడా ఉంది. ఈ జిల్లా కార్యాలయం పెదవాల్తేరులోని రాణి చంద్రమణీదేవి ఆస్పత్రి ప్రాంగణంలో ఉంది. ఏటా వందలాది మందికి వినికిడి పరికరాలు, ట్రైసైకిల్స్, స్టిక్స్ అందిస్తున్నారు. చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు ఇస్తున్నారు. ఉన్నత చదువులకు ఈశాఖ ఆధ్వర్యంలో రుణాలు అందిస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం విభిన్న ప్రతిభావంతులపైనే ఉంది.

ఉద్యోగాల్లో రిజర్వేషన్లు..

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వశాఖలో నాలుగు శాతం రిజర్వేషన్లున్నాయి. ఖాళీలను భర్తీ చేసినప్పుడు వీరి కోటా మేరకు పోస్టులను కేటాయిస్తున్నారు. అలాగే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో విభిన్న ప్రతిభావంతులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా లిఫ్ట్, ర్యాంపుల నిర్మాణానికి నిధులు కేటాయించాయి. విభిన్న ప్రతిభావంతులకు ప్రస్తుతం నెలకు రూ.6 వేల నుంచి వైకల్యాన్ని బట్టి రూ.15 వేల వరకు పెన్షన్ అందుతోంది. వివిధ కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు పెదవాల్తేరు, పెందుర్తిలో వంద సీట్ల సామర్థ్యంతో రెండు బాలుర వసతిగృహాలున్నాయి. బాలికల కోసం ఎండాడ వద్ద రెసిడెన్షియల్ స్కూల్ నిర్వహిస్తున్నారు. ఐటీఐ, మెటల్ షీట్, కార్పెంటర్, పెయింటర్ వంటి శిక్షణ ఇచ్చేందుకు అనుగుణంగా దివ్యాంగుల కోసం ట్రైనింగ్ కమ్ ప్రొడక్షన్ సెంటర్‌ను బక్కన్నపాలెంలో ఏర్పాటు చేశారు. ఎన్‌జీవోల ఆధ్వర్యంలో స్పెషల్ స్కూల్స్ నిర్వహిస్తున్నారు. కేజీహెచ్‌లో ఫిజియోథెరపీ సెంటర్ ఉంది. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం ఎన్‌డీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో రుణాలు అందిస్తోంది. కాగా దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా స్టేడియం నిర్మించేందుకు ప్రతిపాదనలున్నాయి.

వివక్ష వద్దు..

విభిన్న ప్రతిభావంతులపై వివక్ష కూడదని ప్రభుత్వాలతోపాటు అన్ని వర్గాలు సూచిస్తున్నాయి. ఇంట్లో నుంచే వీరిపై వివక్ష మొదలవుతోందని, అది తొలగితే వారు అన్నిరంగాల్లో సత్తా చాటుతారని నిపుణులు చెబుతున్నారు. సరైన ప్రోత్సాహం లేకపోవడంతో నేటికీ సమాజంలో ద్వితీయశ్రేణి పౌరులుగానే మిగిలిపోతున్నారని చెబుతున్నారు. విద్యా, ఉద్యోగాల్లో ఇప్పటికీ ఈ వివక్ష కొనసాగుతోందని దానిని దూరం చేసేందుకు యువత మేల్కొనాలని పిలుపునిస్తున్నారు.



పుష్కరిణిలో దీపాలను విడిచిపెడుతున్న మహిళలు

కాంతులీనిన వరాహ పుష్కరిణి

పోలి పాడ్యమి సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులు



సింహగిరిపై శంఖు, చక్ర, తిరునామాలు



దీపాలను వదులుతున్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన సింహాచలంలోని వరాహ పుష్కరిణి

ప్రారంభమైన నృసింహ దీక్షలు



తులసి మాలలను మాడవీధుల్లో ఊరేగిస్తున్న వైదికులు, భక్తులు

సింహాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దీక్షలకు భక్తుల నుంచి అపూర్వ స్పందన లభించింది. దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం అప్పన్న ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై అర్చకులు చందన మాలల సమర్పణ చేపట్టారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తిచేశారు. అనంతరం ప్రధాన రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను ఉంచి, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యులు చందన మాలలను భక్తులతో కలిసి మాడవీధిలో ప్రదక్షిణంగా వేదిక వద్దకు తీసుకువచ్చారు. వేద పండితులు మంత్రోచ్ఛరణలు చేస్తుండగా షోడశోపచారాల పూజలు చేసిన అనంతరం ఏఈఓ ఆనందకుమార్ భక్తులకు తొలిమాల వేసి దీక్షలకు శ్రీకారం చుట్టారు. మాలలు ధరించిన వారిలో సుమారు 300 మంది గిరిజనులు కూడా ఉన్నారు.

సెంట్రల్‌జైలు సూపరింటెండెంట్‌గా మహేష్‌బాబు



ఆరిలోవ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారానికి నూతన సూపరింటెండెంట్‌గా ఎం.మహేష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం నుంచి బదిలీపై వచ్చారు. కొత్త సూపరింటెండెంట్‌ను నియమించేవరకు మహేష్ బాబు పూర్తి అదనపు బాధ్యతల్లో ఉంటారు. ఇక్కడి నుంచి అనంతపురానికి బదిలీపై వెళ్తున్న ఎస్.కిషోర్ కుమార్ ఈయనకు బాధ్యతలు అప్పగించారు.

వైభవంగా అయ్యప్ప అంబలం పూజ



అయ్యప్ప అంబలం పూజలో పాల్గొన్న ట్రస్ట్ నిర్వాహకులు, గురుస్వాములు

అక్కయ్యపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యెరుమేలి అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అయ్యప్ప అంబలం పూజ కన్నుల పండువగా జరిగింది. తాటిచెట్లపాలెం జాతీయ రహదారి 'ఆంధ్రజ్యోతి' కార్యాలయం పక్కన స్థలంలో ఏర్పాటు చేసిన వేదికపై ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా గురుస్వాములు స్వామికి పూజలు జరిపారు. వందలాది మంది అయ్యప్పమాలధారులతో పాటు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తజనంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా అయ్యప్ప శరణుఘోష, స్వామి భక్తిగీతాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

కనకమహాలక్ష్మి ఆలయానికి ఆధ్యాత్మిక శోభ



ప్రారంభ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, అధికారులు



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

- వైభవంగా మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం

జగదాంబ కూడలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సోమవారం మార్గశిర మాసోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఈవో కె.శోభారాణి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని, అమ్మవారి గర్భగుడిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీచక్ర పీఠం, అమ్మవారు లభించిన బావి, అష్టలక్ష్మి అలంకరణతో ఆలయ ప్రాంగణం ఆకర్షణీయంగా కనిపించింది. ఎమ్మెల్యే తొలి పూజ చేశారు. ఈవో కె.శోభారాణి, వేదపండితులు, అర్చకులు ఎమ్మెల్యేతో పంచామృతాభిషేకం, జలాభిషేకం, పూజలు చేయించారు. అనంతరం మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలిచ్చి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో దర్శనాలకు వచ్చారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆలయం వద్ద అన్ని దారులను మూసేశారు. క్యూలైన్ల ద్వారానే అనుమతించారు. జగన్నాథుని ఆలయంలో ఉచిత అన్న ప్రసాద వితరణకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇందుకోసం ఆలయం వద్ద టిక్కెట్లను అందజేశారు. ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

భద్రతా ఏర్పాట్లపై సీపీ ఆరా

కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకుని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆలయం వద్ద భద్రతా చర్యలపై ఆరా తీశారు. అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన ఆయన విక్టోరియా ఆస్పత్రి వైపు టికెట్, వీఐపీ దర్శనాల క్యూలైన్లు పరిశీలించారు. ఆలయం లోపల, గర్భగుడి వెలుపల తివాచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. దర్శనం అనంతరం భక్తులు బయటకు వెళ్లే మార్గం వద్ద గేట్లు ఏర్పాటు చేయడాన్ని ప్రశ్నించారు. దీనిపై దేవస్థానం ఇంజనీర్ రమణ వివరణ ఇచ్చారు. ప్రతీ గేటుకు తాళం వేసిన చోట ఒక తాళం చెవిని పోలీసులకు అప్పగించాలని సూచిస్తూ, బాధ్యత తీసుకోవాలని వన్‌టౌన్ సీఐ దేముడుబాబును ఆదేశించారు. పార్కింగ్ ఏర్పాట్లు, టౌన్ కొత్త రోడ్డు నుంచి ప్రధాన గోపురం వరకు క్యూలైన్లను తనిఖీ చేశారు. గురువారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. వృద్ధులు, పిల్లల దర్శన ఏర్పాట్లపై సీపీ ఆరా తీశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ పటిష్ట భద్రత కల్పిస్తుందన్నారు. ఈవో కె.శోభారాణి, ఇంజనీరు రమణ, దేవాలయ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 211 దరఖాస్తులు: కలెక్టర్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్



వీఎంఆర్‌డీఏలో వినతులు స్వీకరిస్తున్న ఛైర్మన్

మహారాణిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను 48 గంటల్లో పరిశీలించి, పూర్తిస్థాయిలో విచారణ జరిపిన అనంతరం పరిష్కారం చూపాలని, ఎట్టిపరిస్థితుల్లో పునరావృతం కారాదని కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 211 వినతులు స్వీకరించామన్నారు. ఇందులో రెవెన్యూ 78, జీవీఎంసీ 60, పోలీసు 15, ఇతర శాఖలకు సంబంధించి 58 అర్జీలున్నాయన్నారు. సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్య మూలాలు తెలుసుకుని పరిష్కరించాలని నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవో శ్రీలేఖ పాల్గొన్నారు.

సమస్యలు సత్వరం పరిష్కరించాలి

సిరిపురం: ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ ఆదేశించారు. వీఎంఆర్డీఏ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, సంయుక్త కమిషనర్ కె.రమేష్ అర్జీలు స్వీకరించారు. బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తొమ్మిది అర్జీలలో ల్యాండ్ అక్విజిషన్ 2, రియల్ ఎస్టేట్ 2, రెవెన్యూ, అటవీశాఖకు ఒక్కోటి, ప్రణాళిక విభాగానికి మూడు వచ్చాయన్నారు. భవానీశంకర్, శిల్ప, హరిప్రసాద్, శివానీ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ ఎదుట పాడి రైతుల నిరసన

- పాల సేకరణ తగ్గింపుపై ఆందోళన ఉద్రిక్తం
- యాజమాన్యం స్పందించకపోవడంతో గేట్లు తోసుకుని లోనికి వెళ్లి బైఠాయింపు
- సమస్యల పరిష్కారానికి ఎండీ హామీ



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డెయిరీ ఎండీ ఎస్‌వీ రమణ

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాల సేకరణ ధరను పెంచాలని కోరుతూ పాడి రైతులు సోమవారం విశాఖ డెయిరీ ఎదుట నిర్వహించిన ఆందోళన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు నిలువరించినప్పటికీ డెయిరీ గేట్లు తోసుకుని ఎండీ కార్యాలయం వద్దకు వెళ్లి బైఠాయించారు. ఆవు పాల సేకరణ ధరను డెయిరీ యాజమాన్యం తగ్గించడాన్ని నిరసిస్తూ విజయనగరం పాడి రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాడి రైతులు సోమవారం డెయిరీ మెయిన్‌గేటు ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సేకరణ ధరలను పెంచాల్సిన యాజమాన్యం తగ్గించడం సిగ్గుచేటన్నారు. డెయిరీని తక్షణం రాష్ట్ర ప్రభుత్వం సహకార చట్టం పరిధిలోకి తీసుకొని, యాజమాన్యం అవినీతిపై దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. రైతులను, కార్మికులను ఆదుకోవాలన్నారు. సుమారు మూడు గంటలపాటు నిరసన చేపట్టినప్పటికీ యాజమాన్యం నుంచి స్పందన లేకపోవడంతో మెయిన్ గేటుకు అడ్డుగా ఉన్న పోలీసులను తోసుకుంటూ రైతులు లోపలకు వెళ్లారు. ఎండీ కార్యాలయం ఎదుట బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సౌత్ ఏసీపీ త్రినాథ్ సమస్యను డెయిరీ ఎండీ ఎస్.వి.రమణకు వివరించడంతో ఆయన ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వచ్చి డిమాండ్లను తెలుసుకున్నారు. డెయిరీ యాజమాన్యంతో పాటు త్వరలో జరగనున్న బోర్డు డైరెక్టర్ల సమావేశం దృష్టికి తీసుకువెళ్లి నెరవేర్చేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. శాంతించిన రైతులు..తమ సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే మరోసారి డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో రైతు సంఘ నాయకులు ముర్రపు సూర్యనారాయణ, బి.రాంబాబు, గొంప కృష్ణమూర్తి, ఎల్.ఆదినారాయణ, భూలోక నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

సంప్‌లో పడి డ్రైవర్ మృతి

- కోరమాండల్ ఎరువుల కర్మాగారంలో ఘటన
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు
- న్యాయం చేయాలని మృతుడి బంధువులు, కార్మికుల ఆందోళన



రమణ (ఫైల్ ఫొటో)

మల్కాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంప్‌లో పడి ఓ డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి కోరమాండల్ ఎరువుల కర్మాగారంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... శ్రీలానగర్‌కు చెందిన చెందిన సారిక రమణ (36) రాఘవ టాక్సీ సర్వీసెస్ ద్వారా కోరమాండల్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు విధులకు హాజరయ్యాడు. రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి వెళ్లిపోవాలి. కానీ రాత్రైనా ఇంటికి రాకపోవడంతో భార్య సత్యవతి ఎన్నిసార్లు ఫోన్‌చేసిన లిఫ్ట్ చేయలేదు. కాగా సోమవారం ఉదయం కంపెనీ నుంచి రమణకు ఆరోగ్యం బాగాలేదు. కేజీహెచ్‌లో ఉన్నాడంటూ కంపెనీ నుంచి ఫోన్ రావడంతో ఆందోళనగా పరుగు తీశారు. తీరా ఆస్పత్రికి వెళ్లే సరికి రమణ మృతదేహం కనిపించింది. విధుల నుంచి వెళ్తున్నట్టు కంపెనీకి చెందిన ఏ సీసీ కెమెరాలోనూ నమోదుకాకపోవడంతో అధికారులు నిశితంగా పరిశీలించగా రమణ సంప్‌వైపు వెళ్లినట్టు గుర్తించారు. అక్కడికి వెళ్లి చూడగా శవమై కనిపించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు మృతదేహన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా రమణకు ఇబ్బందులు లేవని, సంప్ దగ్గరకు ఎందుకు వెళ్లాడు, ఎలా మృతిచెందాడో తెలియాల్సి ఉందని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. సీఐ విద్యాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

మృతుడు రమణ కుటుంబానికి న్యాయం చేయాలని కోరమాండల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు కంపెనీ మెయిన్ గేటు వద్ద సోమవారం మధ్యాహ్నం ఆందోళనకు దిగారు.మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారని కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. రమణ సంప్‌లో పడి మృతిచెందితే, వాస్తవం చెప్పకుండా కంపెనీ యజమాన్యం నాటకం ఆడిందని, అతడి భార్య సత్యవతి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. మృతుడి కుటుంబానికి రూ.40 లక్షల పరిహారం చెల్లించాలని కార్మిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఆందోళనలో విశాఖ లేబర్ యూనియన్ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, గుడాల రాంబాబు, శేఖర్, ప్రకాశ్, సత్యనారాయణరెడ్డి , కోలాట శంకర్, మహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

40 కిలోల గంజాయి స్వాధీనం: ముగ్గురి అరెస్టు

కూర్మన్నపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి విశాఖ మీదుగా చెన్నైకు తరలిస్తున్న 40 కిలోల గంజాయిని ముందస్తు సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, దువ్వాడ పోలీసులు ఆదివారం రాత్రి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు సమీపంలోని మంగళపాలెంలో స్వాధీనం చేసుకున్నారు. సీఐ మల్లీశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం గుర్రందొరపాలేనికి చెందిన పూడి శ్రీనివాస్, రోలుగుంట మండలం రత్నంపేటకు చెందిన ఉమ్మడి ఉపేంద్ర, కొకోట మండలం గోకివానిపాలేనికి చెందిన సారిపల్లి రామకృష్ణలు పాడేరులో ఓ ఆటోడ్రైవర్ వద్ద 40 కిలోల గంజాయిని కొనుగోలు చేసి రెండు కిలోల చొప్పున 20 ప్యాకెట్లుగా మార్చారు. వీటిని గోనె సంచుల్లో వేసి పల్సర్ బైకుపై తీసుకువస్తుండగా మంగళపాలెం వద్ద టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు తనిఖీలు జరిపి గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిలో ఉపేంద్ర, రామకృష్ణలు గంజాయి కేసులో పాత నేరస్తులే. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

డ్రైఫ్రూట్స్ పేరుతో గంజాయి తరలింపు.. నలుగురి అరెస్టు



గంజాయి ప్యాకెట్లు పరిశీలిస్తున్న డీసీపీ అజితా వెంజెండ్ల

మహారాణిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డ్రైఫ్రూట్స్ పేరుతో కొరియర్ బుక్ చేసి గంజాయిని తరలిస్తున్న నలుగురు బీహారీలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 122 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ అజితా వెంజండ్ల తెలిపారు. సోమవారం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. బీహార్‌కు చెందిన ధనుంజయ కుమార్, ప్రధుమన్, ఇంద్రదేవ్, సంతోష్‌కుమార్‌లు డ్రైఫ్రూట్స్ అంటూ ఒక కొరియర్ సంస్థలో బుక్ చేశారు. వీరిని అనుమానించిన కొరియర్ సంస్థ వెంటనే పోలీసులకు సమాచారాన్ని చేరవేశారు. బీహార్‌కు చెందిన వీరు ఒడిశాలోని కోరాపుట్ జిల్లా మాచ్‌ఖండ్ నుంచి ఢిల్లీకి కొరియర్ బుక్ చేసినట్లు గుర్తించారు. 64 ప్యాకెట్లలో ఉన్న 122.42 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, అల్లిపురం ప్రాంతంలో ఉంటున్న బీహారీలను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ అజితా వెంజెండ్ల తెలిపారు.